


www.epapersamayam.com

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

STV SAMAYAM

సంపుటి : 18 | సంచిక : 198 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 27 మార్చి 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5


## పాక్షిక యుద్ధ విరమణకు సిద్ధమే


- ఒప్పందాలు ఉల్లంఘిస్తే రష్యాపై ఆంక్షలు విధించాలి: జెలెన్‌స్కీ



**కీవ్:** ఇంధన సంబంధిత మౌలిక సదుపాయాల వరకు పాక్షిక యుద్ధ విరమణకు తాము సిద్ధమేనని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ప్రకటించారు. సౌదీ అరేబియాలో ఉభయపక్షాలతో అమెరికా మాట్లాడి ఈ మేరకు ప్రతిపాదించిన ఒప్పందం ప్రకారం ముందుకు వెళ్లేందుకు తాము సన్నద్ధంగా ఉన్నామని మంగళవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విలేకరులకు ఆయన తెలిపారు. ఒప్పందాలను రష్యా ఉల్లంఘిస్తే ఆ దేశంపై ఆంక్షలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కోరతానని చెప్పారు. తమకు

తరువాయి 2లో

# ఉప ఎన్నికలు రావు



- మా దృష్టి అభివృద్ధి, సంక్షేమంపైనే
- వ్యసనాలకు తెలంగాణలో తావులేదు
  ఆన్‌లైన్ బెట్టింగ్, యాప్‌లపై సిట్ ఏర్పాటు
- శిక్ష పెంచేలా చట్ట సవరణ
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**సమయం న్యూస్, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావని.. గత ప్రభుత్వ హయాంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో ఏం జరిగిందో ఇప్పుడూ అదే జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం దృష్టి అభివృద్ధి, సంక్షేమంపైనేనని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి భారాస అడ్డం పడుతోందని, పెట్టుబడులు రాకూడదనే ఉద్దేశంతో తప్పుడు ప్రచారం చేస్తోందని నిప్పులు చెరిగారు. బుధవారం హోం, అడ్మినిస్ట్రేషన్ పద్దుపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు.

*** 2014-23 సంప్రదాయాల్నే అనుసరిస్తాం**

"20142023 మధ్యకాలంలో విపక్ష ఎమ్మెల్యేల్ని భారాస తమ పార్టీలో చేర్చుకుంది. కొందరు మంత్రులు కూడా అయ్యారు. వారెవరిపైనా అనర్హత వేటు పడలేదు. అప్పటి నుంచి

తరువాయి 2లో



## అది అమానవీయ, క్రూరమైన అభిప్రాయం

- అత్యాచార నేరంపై అలహాబాద్ హైకోర్టు తీర్పును తప్పపట్టిన సర్వోన్నత న్యాయస్థానం
- న్యాయమూర్తి వివాదాస్పద వ్యాఖ్యలపై స్టే విధింపు

**సమయం న్యూస్, దిల్లీ:** మహిళల దుస్తులు లాగడం, ఛాతీ భాగాన్ని తాకడం అత్యాచార నేరం కిందకు రాదని, బలవంతపెట్టడం లేదా వివస్త్రను చేసే యత్నంగానే పరిగణించాలన్న అలహాబాద్ హైకోర్టు జడ్జి తీర్పులోని వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం 'స్టే' విధించింది. హై కోర్టు జడ్జి వ్యక్తపరిచిన అభిప్రాయం అమానవీయమైన, క్రూరమైనదిగా అభివర్ణించింది. న్యాయ సూత్రాలకు పొసగని ఈ వివాదాస్పద తీర్పును తీవ్రంగా పరిగణిస్తున్నామని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌ధర్మాసనం స్పష్టం చేసింది. భారత ప్రధాన

తరువాయి 2లో



## పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై తీవ్ర ఉద్రిక్తత

- క్రైస్తవ సంఘాల ప్రతినిధులు భారీగా రాక
- రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తి
- సమగ్ర విచారణకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఘటనకు కారణాలపై ప్రాథమిక నిర్ధారణకు రాలేదు: ఎస్పీ

2లో



## భూ భారతితో సమస్యలకు చరమగీతం

*** మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**సమయం న్యూస్, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి రోజు చూసుకుని ఏప్రిల్‌లో ప్రారంభించనున్న భూ భారతి చట్టం, పోర్టల్‌లతో తెలంగాణలోని భూ సమస్యలన్నింటికీ చరమగీతం పాడతామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల పద్దులపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన

తరువాయి 2లో

## ఆగ్రాలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇంటిపై దాడి

- రాణా సంగాపై వ్యాఖ్యలకు క్షమాపణలు తెలపాలన్న కర్ణి సేన

2లో





## కేటీఆర్ వ్యాఖ్యలపై శాసనసభలో దుమారం

- కమీషన్ల ఆరోపణలపై భట్టి ఆగ్రహం
- ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ వ్యాఖ్య
- సభ నుంచి వాకౌట్ చేసిన భారాస

**సమయం న్యూస్, హైదరాబాద్:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే కె.తారక రామారావు బుధవారం శాసనసభలో చేసిన కమీషన్ వ్యాఖ్యలు దుమారం రేపాయి. కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ సభ్యులు సభలో ఆందోళన చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని ఉప


తరువాయి 2లో


## రైతులకు ఉచితంగా సూక్ష్మ పోషకాలు

- ఆక్వా రైతులకు రూ. 1.50కే యూనిట్ విద్యుత్
- ఐదు హబ్‌లుగా రాష్ట్రంలో అభివృద్ధి
- కర్నూలు జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ
- నవంబర్‌లో సత్యసాయి శతజయంతి వేడుకలు నిర్వహిద్దాం
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

**సమయం న్యూస్, అమరావతి:** 'రాష్ట్రంలో రైతులకు ఉచితంగా సూక్ష్మ పోషకాలు సరఫరా చేద్దాం. దీనివల్ల పంటల దిగుబడి పెరుగుతుంది. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్తు రూ.1.50కే ఇద్దాం. జోన్,

తరువాయి 2లో





## అపచారం.. అపచారం..

- వైకాపా హయాంలో శ్రీవారి నిత్య నైవేద్యాలకు నాసిరకం సరకులు
- సరఫరాదారుకు నిబంధనలకు విరుద్ధంగా ప్రయోజనాలు

**సమయం న్యూస్, తిరుమల:** తిరుమల శ్రీవారి క్షేత్రాన్ని వైకాపా ఐదేళ్ల పాలనలో నానా రకాలుగా భ్రష్టు పట్టించిన నాటి తితిదే పెద్దలు, అధికారులు.. తుదకు వేంకటేశ్వర స్వామివారికి సమర్పించిన నైవేద్యంలోనూ కల్తీ సరకులు వాడిన సంగతి బయటపడింది. దాత ముసుగులో వచ్చిన ఓ వ్యాపారి నాలుగేళ్ల పాటు నిరాటంకంగా సాగించిన అపచారాన్ని కూటమి ప్రభుత్వం

తరువాయి 2లో

# ఉప ఎన్నికలు రావు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటివరకు చట్టం, న్యాయం, రాజ్యాంగం మారలేదు. ఏ రాజ్యాంగం ప్రకారం ఉప ఎన్నికలు వస్తాయి? 201423 వరకు ఈ సభ అనుసరించిన విధానాలనే మేమూ అనుసరిస్తాం. రూల్ బుక్ కూడా మారలేదు. వారు రాసిందే ఈ పుస్తకం (రూల్‌బుక్ చూపిస్తూ). ఎలాంటి ఉప ఎన్నికలు రావు'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకాయన ఉప ఎన్నికల్లో 'నేనే అభ్యర్థిని' అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఆయన పదవిలో ఉన్నప్పుడు మంచి పంచె కట్టుకుని తిరిగారు. అలా తిరిగితే పదవి పోతుందని నేను ఆనాడే హెచ్చరించా. అలా చెప్పిన నెల రోజుల్లోనే ఆయన ఉపముఖ్యమంత్రి పదవిని తీసేశారు. ఆ అమాయకుడే ఇప్పుడు వారంలో ఉప ఎన్నికలని తిరుగుతున్నారు'' అని రేవంత్ అన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశం సుప్రీంకోర్టులో ఉందని, ఇక్కడ ఎలా మాట్లాడతారని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. అసెంబ్లీ లోపల మాట్లాడేందుకు సభ నుంచి రక్షణ ఉంటుందని సీఎం అన్నారు.

*** జమిలి వస్తే 2029లోనే ఎన్నికలు**

''భాజపా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చెబుతున్నట్లు జమిలి ఎన్నికలు వస్తే ఈ అసెంబ్లీ గడువు మరో ఆరు నెలలు పెరుగుతుంది. 2028కి బదులు 2029లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'నేను ఆయన (కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ) అడుగుజాడల్లో నడవడం లేదు. అలా నడిస్తే మడుగుల్లో పడతాం' అని అన్నారు.

*** పెట్టుబడులు రాకుండా ప్రతిపక్షం కుట్ర**

''ఏ మంచి పని చేద్దాం అన్నా.. తెలంగాణలో శాంతిభద్రతలపై ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోంది. రాష్ట్రం ఆర్థికంగా కుప్పకూలిందని అబద్ధాలు చెబుతోంది. ఆ నేతలు పెట్టుబడులు రాకుండా కుట్రలు చేస్తున్నారు. ఈ తీరు తెలంగాణకు మంచిది కాదు. భారాస హయాంలో వామనరావు దంపతుల్ని నడిరోడ్డుపై నరికి చంపినా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఆరోపణలు ఉన్న వ్యక్తిని కేసు నుంచి తప్పించి, ఎన్నికల్లో బీఫారం ఇచ్చారు. జూబ్లీహిల్స్ అత్యాచార ఘటనలో భారాస నాయకుడి కుమారుడున్నా చర్యలు తీసుకోలేదు. మహిళలపై అఘాయిత్యాల్లో అప్పుడు తెలంగాణ దేశంలోనే నాలుగో స్థానంలో ఉంది. కొద్దిరోజుల క్రితం 'ఎంఎంటీఎస్ రైలు ఘటన' జరిగితే రైల్వే పోలీసుల పరిధి అయినప్పటికీ ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది'' అని రేవంత్ వివరించారు.

*** జానారెడ్డి, భట్టిని ఆదర్శంగా తీసుకోవాలి..**

''భారాస నేతలు కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతున్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా జానారెడ్డి ఉన్నప్పుడు పార్టీ కంటే తెలంగాణ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చారు. భట్టి విక్రమార్క కూడా ప్రతిపక్షనేతగా ప్రభుత్వానికి సలహాలు ఇచ్చారు. కక్షగట్టి విపక్షహోదా తీసేసినా ఆయన సూచనలు ఇచ్చారు. మీరు (ప్రతిపక్షం) కూడా జానారెడ్డి, భట్టి విక్రమార్కలను ఆదర్శంగా తీసుకోవాలి.

*** కేసీఆర్ కలిసినా గజ్వేల్ అభివృద్ధిపై మాట్లాడతా**

భారాసలో ఇద్దరు నాయకుల మధ్య అంతర్గతపోరు ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ఒకరు ఉదయం ప్రెస్‌మీట్ పెడితే, మధ్యాహ్నం మరొకరు 'ఎక్స్'లో పోస్టు పెడతారు. నా దగ్గరకు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, భాజపా వెంకటరమణారెడ్డి... ఇలా ఎవరు నియోజకవర్గ సమస్యలు తెచ్చినా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తా. వారే కాదు.. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ వచ్చినా గౌరవిస్తా. గజ్వేల్ అభివృద్ధిపై మాట్లాడతా. ఎవరిపైనా వివక్ష చూపించం. భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ 95 శాతం నిజం కాబోతోంది. 201423 మధ్య బడ్జెట్లలో ఆచరణ సగటున 25 శాతం తేడా ఉంది'' అని సీఎం తెలిపారు.

*** గుంటనక్కలకు గుణపాఠం చెబుతాం**

గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమి సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) ది కాదు. ఆ భూమిని దాదాపు 25 ఏళ్లక్రితం అప్పటి ప్రభుత్వం ఐఎంజీకి కేటాయించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సుప్రీంకోర్టులో పోరాడి కేసు గెలిచాం. భూముల్ని స్వాధీనం చేసుకుని, టీజీఐఐసీకి కేటాయించాం. అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణకోసం అభివృద్ధి చేయబోతున్నాం. ఆ భూముల్లో రక్షిత అటవీప్రాంతం ఉన్నట్లు, జీవరాశులు తిరుగుతున్నట్లు, చెరువులు, రాళ్లు ఉన్నాయంటూ మాట్లాడుతున్నారు. నిజనిర్ధారణ కమిటీ వేద్దాం. ఎమ్మెల్యేలను తీసుకెళ్లి చూపిద్దాం. అక్కడ నక్కలు, పులులు, సింహాలు లేవు. ఆ భూముల చుట్టూ గుంటనక్కలు చేరి వివాదం చేస్తున్నాయి. ఆ గుంటనక్కలకు గుణపాఠం చెబుతాం. ఆ భూమి 100 శాతం అభివృద్ధి చెందిన ప్రాంతంలో ఉంది. హెచ్‌సీయూకి ఆ భూములతో ఏం సంబంధం'' అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

*** అభివృద్ధి... ఆర్ఆర్ఆర్ వద్దా?**

''ఆమనగల్లుకు రోడ్డు అంటే మా అత్తగారి ఊరుకు రోడ్డు వేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అనుసంధానానికి వేసే 11 రేడియల్ రోడ్లలో అది ఒకటి. ఆ కుటుంబం ఆ గ్రామాన్ని వదిలి ఐదు దశాబ్దాలు అయింది. వాళ్లు అనుకుంటే సొంత ఖర్చులతో రెండింతల పెద్ద రోడ్డు వేసుకునే ఆర్థిక స్తోమత ఆ కుటుంబానికి ఉంది. ప్రతిపక్షాన్ని నేను అడుగుతున్నా.. రాష్ట్రంలో అభివృద్ధి వద్దా? ఆర్ఆర్ఆర్ వద్దా? ఫ్యూచర్‌సిటీ కట్టాలా? వద్దా? మూసీ పునరుద్ధరణ చేయాలా? వద్దా? ఫ్యూచర్‌సిటీని.. ఫోర్ బ్రదర్స్ సిటీ అని ఆరోపిస్తున్నారు. అది నాలుగు కోట్ల సోదర సోదరీమణుల భవిష్యత్ నగరం'' అని సీఎం తెలిపారు.

# భూ భారతితో సమస్యలకు చరమగీతం

(మొదటిపేజీ తరువాయి)

సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ''2020లో భారాస హయాంలో ఎవరితోనూ సంప్రదించకుండానే.. ఓ నలుగురు నాలుగు గోడల మధ్య కూర్చుని రూపొందించిన రెవెన్యూ చట్టం, ధరణి పోర్టల్‌తో అనేక సమస్యలు ఏర్పడ్డాయి. భూ యజమానులకు వారి హక్కులపై అభద్రత ఏర్పడింది. ధరణిని ప్రక్షాళన చేస్తామని శాసనసభ ఎన్నికలకు ముందు ప్రకటించాం. చెప్పినట్లుగానే విదేశానికి చెందిన టెర్రా ఐసిస్ నుంచి స్వదేశీ సంస్థ ఎన్ఐసీకి పోర్టల్ బాధ్యతలు అప్పగించాం. ప్రజల అభిప్రాయాలు తీసుకునేందుకు కొత్త చట్టాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టాం. అందరి సలహాలు, సూచనలు స్వీకరించి ఈ ఏడాది జనవరి 4న భూ భారతి బిల్లు సభలో పెట్టి చట్టం చేశాం. చట్టం చేసి మూడు నెలలు కాక ముందే అన్ని అంశాలతో రూల్స్ రూపొందిస్తున్నాం. పక్షం రోజుల్లో నిబంధనలు సిద్ధమవుతాయి.

*** ధరణిని రిఫరెండంగా తీసుకుంటారా?**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూభారతి చట్టాన్ని రెఫరెండంగా తీసుకుని పోటీ చేస్తాం. ధరణి చట్టాన్ని రెఫరెండంగా చూపి భారాస పోటీ చేయాలి. ప్రజలు ఎవర్ని ఆశీర్వదిస్తారో చూద్దాం. రాష్ట్రంలో ఎప్పటికైనా భూ సర్వే తప్పనిసరి అని ప్రభుత్వం గుర్తించింది. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సందర్భంగా సర్వే పటం జత చేయాలని కొత్త చట్టంలో నిబంధన పెట్టాం. రాష్ట్రంలో 10,954 రెవెన్యూ గ్రామాధికారులను నాటి ప్రభుత్వం రద్దు చేయగా మా ప్రభుత్వం పునరుద్ధరణ చేపట్టింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకమైన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు స్లాట్ విధానాన్ని అమలు చేయనున్నాం. మొదట హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోని 17 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్టుగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తాం. ఈ విధానంలో 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను గత ప్రభుత్వం స్వీకరించింది. ఏడాదిన్నర సమయం పక్కన పెట్టింది. మా ప్రభుత్వం ఉచితంగా చేస్తుందా.. లేదా.. అన్నది ప్రజలకు స్పష్టంగా తెలుసు. భారాస ప్రభుత్వం 2.50 లక్షల రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు టెండర్లు పిలిచినా 14 వేల వరకు గ్రౌండ్ కాలేదు. 1.72 లక్షల వరకు పనులు ప్రారంభించలేదు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి విడతగా 4.50 లక్షల ఇళ్లను గత బడ్జెట్‌లోనే పెట్టాం. కొద్దిగా ఆలస్యమైన మాట వాస్తవమే. పునాదులు కూడా నిర్మించుకునే స్తోమత లేని వారికి మహిళా గ్రూపుల్లో పొదుపు సొమ్ము ఉంటే అనుసంధానం చేసి రూ.లక్ష సాయం అందించేలా నా నియోజకవర్గంలో ఏర్పాటు చేశా. మిగిలిన సభ్యులూ ఇలాంటి ప్రయత్నం చేయొచ్చు. సమాచార శాఖలో ప్రకటనల విషయంలో.. పదేళ్ల భారాస పాలనలో విచ్చలవిడిగా ప్రజల సొమ్మును లూటీ చేశారు. బయటి రాష్ట్రాల్లోనూ ప్రకటనలు ఇచ్చారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, హోర్డింగ్‌లకు రూ.546 కోట్లను గత ప్రభుత్వం ఖర్చు చేసింది. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాకు ఇచ్చే టారిఫ్‌ల విషయంలోనూ ఇదే జరిగింది. పదేళ్లలో నాటి ప్రభుత్వం వారి సొంత వ్యవస్థకు ఎంత పెట్టిందో.. మిగతా వ్యవస్థలకు ఎంత పెట్టిందో సమయం ఇస్తే చర్చకు సిద్ధం'' అని పొంగులేటి పేర్కొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై తీవ్ర ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

రాజమహేంద్రవరం: సువార్త ప్రసంగికుడు ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై వివిధ క్రైస్తవ సంఘాల ఆందోళనలతో బుధవారం రాజమహేంద్రవరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రవీణ్ మృతిపై అనుమానాలున్నాయని, ప్రభుత్వం, పోలీసులు తమకు న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చేవరకు పోస్టుమార్టానికి వీల్లేదని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు జీజీహెచ్ ఎదుట ఆందోళనకు దిగారు. చివరకు పోలీసులు నిరసనకారులతో చర్చించి, పోస్టుమార్టం పూర్తిచేసి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సికింద్రాబాద్‌లో నివాసం ఉండే ప్రవీణ్‌కుమార్ (45) తూర్పు గోదావరి జిల్లా చాగల్లులో జరిగే క్రైస్తవ సభలకు హాజరయ్యేందుకు సోమవారం సాయంత్రం బైక్‌పై బయల్దేరారు. మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం సమీపంలోని కొంతమూరు వద్ద రోడ్డు పక్కన విగతజీవిగా పడి ఉన్న స్థితిలో ఓ కానిస్టేబుల్ గుర్తించారు. ఇది రోడ్డు ప్రమాదంగా భావించినప్పటికీ, ఈ ఘటనపై తమకు అనుమానాలున్నాయని కుటుంబసభ్యులు, క్రైస్తవ సంఘాలు తెలపడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించారు. హైదరాబాద్ నుంచి కుటుంబసభ్యులు చేరుకోనందున మంగళవారం పోస్టుమార్టం చేయలేదు.

*** రోజంతా ఆందోళనలు**

*అంబులెన్సులో జీజీహెచ్ నుంచి మృతదేహాన్ని బందోబస్తు మధ్య తరలిస్తున్న పోలీసులు*

ప్రవీణ్ మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం చేసేందుకు సిద్ధంకాగా, వివిధ సంఘాల ఆందోళనలతో రోజంతా ఉద్రిక్తత నెలకొంది. తొలుత మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆధ్వర్యంలో కొందరు ఆసుపత్రిలోని పోలీసు అవుట్ పోస్టు ఎదురుగా బైఠాయించారు. మతపెద్దలు సబ్బెళ్ల విజయప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌సిన్హా, సంజీవరావు, నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూడా చేరుకున్నారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ మధ్యాహ్నం జీజీహెచ్‌కు వచ్చి ఆసుపత్రి వర్గాలు, క్రైస్తవ మతపెద్దలతో చర్చించారు. కుటుంబసభ్యుల సమక్షంలో వీడియో తీస్తూ పోస్టుమార్టం చేస్తామని చెప్పడంతో, మధ్యాహ్నం 2.30కు ప్రక్రియ ప్రారంభించారు. రెండున్నర గంటల పాటు పోస్టుమార్టం జరిగింది. అంతలోనే ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ రావడంతో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. ఆయన్ను పోస్టుమార్టం ప్రాంతానికి అనుమతించారు. మృతదేహాన్ని అంబులెన్సులో హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మళ్లీ కొందరు నినాదాలు చేస్తూ, వాహనాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వం సమాధానం చెప్పేవరకూ భౌతికకాయాన్ని కదలనివ్వమని నిలువరించారు. చివరకు పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి, రోప్ పార్టీ సాయంతో జాతీయ రహదారి వైపు మళ్లించారు.

## ఆగ్రాలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఇంటిపై దాడి

ఆగ్రా: సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) రాజ్యసభ ఎంపీ రాంజీ లాల్ సుమన్‌కు చెందిన ఆగ్రాలోని నివాసంపై బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దాడి జరిగింది. నగరంలోని హరిపర్వత్ చౌరస్తా సమీపంలోని రాంజీ లాల్ ఇంటి వెలుపల నిలిపి ఉంచిన కార్లు, ఇంటి కిటికీ అద్దాలు, కుర్చీలు ఈ ఘటనలో ధ్వంసమయ్యాయి. అక్కడ భద్రత విధుల్లో ఉన్న ఒక పోలీసు గాయపడ్డారు. పార్లమెంటులో ఇటీవల రాణా సంగా (సంగ్రామ సింగ్)పై రాంజీ లాల్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కర్ణి సేన కార్యకర్తలు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. 16వ శతాబ్ద ప్రారంభంలో మేవార్ పాలకుడు, రాజ్‌పుత్‌ల ఆరాధ్యుడైన రాణా సంగాపై విమర్శలు చేసినందుకు గాను రాంజీ లాల్‌తో పాటు ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ క్షమాపణలు కోరాలని కర్ణి సేన డిమాండ్ చేస్తోన్న నేపథ్యంలో ఈ ఘటన జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బుధవారం ఆగ్రా పర్యటనలో ఉన్న సమయంలోనే ఎంపీ నివాసంపై దాడి జరగడాన్ని అఖిలేశ్ యాదవ్ ఖండించారు. రాష్ట్రంలో హింసను అడ్డుకుంటానని చెబుతున్న ముఖ్యమంత్రి తీసుకున్న చర్యలేమిటని సమాజ్‌వాదీ పార్టీ అధినేత ప్రశ్నించారు.

## అది అమానవీయ, క్రూరమైన అభిప్రాయం

(మొదటిపేజీ తరువాయి)

న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశాల మేరకు ఈ కేసును ధర్మాసనం సుమోటోగా స్వీకరించి బుధవారం విచారణ జరిపింది. హైకోర్టు జడ్జి గురించి తీవ్ర పదజాలాన్ని వినియోగించాల్సి రావడం పట్ల ధర్మాసనం విచారం వ్యక్తం చేసింది. మార్చి 17న అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ రామ్‌మనోహర్ నారాయణ్ మిశ్రా వివాదాస్పద తీర్పులోని పేరాలు 21, 24, 26లు న్యాయ సూత్రాలకు విరుద్ధమైనవని తెలిపింది. వీటిని ఉటంకిస్తూ ఇతర కేసుల్లో నిందితులకు ఉపశమనం కలిగించేలా న్యాయస్థానాలు ఉత్తర్వులివ్వరాదంటూ 'స్టే' విధించింది.

## కేటీఆర్ వ్యాఖ్యలపై శాసనసభలో దుమారం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అనడంతో సభలో మరింత ఉద్రిక్తత తలెత్తింది. భారాస క్షమాపణలు చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు, కాంగ్రెస్ క్షమాపణల్ని డిమాండ్ చేస్తూ భారాస సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. భారాస సభ్యులు పోడియం ముందుకు వచ్చి భట్టి వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. దీంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. బుధవారం సభ ప్రారంభం కాగానే వివిధ శాఖల పద్దులను మంత్రులు ప్రవేశపెట్టారు. రెవెన్యూ, గృహ నిర్మాణం పద్దులపై భారాస సభ్యుడు కేటీఆర్ మాట్లాడారు. ''సభలో ఎన్ని సార్లు అంతరాయం కలిగిస్తారు? మంత్రులు అలా మాట్లాడితే ఎలా? ప్రతిపక్షాలు సహజంగానే ప్రభుత్వం అమలు చేయని హామీలను, చేయని పనులను ఎత్తి చూపుతాయి. 30 శాతం కమీషన్ అని వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నారు. 20 శాతం కమీషన్ అని సచివాలయంలో ధర్నాలు అవుతున్నాయి'' అని కేటీఆర్ అన్నారు. కమీషన్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ''మేము ఓ బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చాం. అడ్డగోలుగా మీలాగా రాష్ట్రంలో పడి బరితెగించి దోపిడీ చేయడానికి రాలేదు. ప్రజలకు సేవ, మేలు చేయాలని వచ్చాం. వివిధ వర్గాలను ఆదుకోవడానికి ఉన్నతమైన ఆలోచనలతో ఉన్నాం. మాట్లాడేది నిజమో కాదో తెలుసుకుని మాట్లాడాలి'' అని భారాస సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 శాతం కమీషన్ అంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు ప్యానెల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు. 'బట్టలు ఊడతీసి కొడతాం.. ఒళ్లు దగ్గర పెట్టుకో..' వంటి వ్యాఖ్యలు చేయవచ్చా, ఇవీ అనుచిత వ్యాఖ్యలు కావా అంటూ భారాస సభ్యులు ప్రశ్నించారు. ఈ గందరగోళం మధ్యలోనే భట్టి వ్యాఖ్యలపై తనకు మాట్లాడడానికి అవకాశం కల్పించాలని కేటీఆర్ కోరారు. అందుకు ప్యానల్ స్పీకర్ ఒప్పుకోలేదు. భాజపా సభ్యుడు హరీశ్‌బాబును చర్చ కొనసాగించాలని కోరారు. దీంతో భారాస సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

## రైతులకు ఉచితంగా సూక్ష్మపోషకాలు

(మొదటిపేజీ తరువాయి)

నాన్ జోన్ అని లేకుండా ఎక్కడ ఆక్వా రైతు రిజిస్ట్రేషన్ చేసుకున్నా వారికి రాయితీపై విద్యుత్తు అందిద్దాం. రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే రాయితీపై విద్యుత్తు ఇవ్వబోం. కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాలు ఇవి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల సదస్సు రెండో రోజు (బుధవారం) తీసుకున్న అనేక నిర్ణయాలను ఆయన వెల్లడించారు. విశాఖనగరం చుట్టుపక్కల ప్రాంతాలు ఒక హబ్‌గా.. రాజమహేంద్రవరంకొవ్వూరు సమీప ప్రాంతాలు గోదావరి హబ్‌గానూ, అమరావతివిజయవాడ, కర్నూలు, సత్యసాయి, అనంతపురాలు మరో హబ్‌గా, తిరుపతి చుట్టుపక్కల పంచాయతీలు ఆ కార్పొరేషన్‌తో కలిపి మరొకటి.. ఇలా ఐదు హబ్‌లను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తామని చంద్రబాబు తెలిపారు. ఇప్పటికే విశాఖ చుట్టుపక్కల ప్రాంతాలకు సంబంధించి నీతి ఆయోగ్ ఒక నివేదిక సిద్ధం చేసిందని ముఖ్యమంత్రి చెప్పారు. రానున్న రోజుల్లో హిందూపూర్, అనంతపురం మధ్య మంచి అభివృద్ధి జరుగుతుందన్నారు. మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో రాజమహేంద్రవరం, కొవ్వూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ఇప్పటి నుంచే చేపడదామని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ఏడాది నవంబరులో సత్యసాయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని, అందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

## ద.కొరియాలో కార్చిచ్చు విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

అక్కడి 7వ శతాబ్దానికి చెందిన పురాతన దేవాలయం ధ్వంసమైంది. దక్షిణాన ఉన్న చియోంగ్‌సాంగ్ జైలు నుంచి 500 మంది ఖైదీలను సురక్షితంగా తరలించినట్లు న్యాయశాఖ వెల్లడించింది. ఈ కార్చిచ్చు అత్యంత ఘోరమైందని, దీని కారణంగా తీవ్ర నష్టం వాటిలినట్లు ప్రధానమంత్రి, తాత్కాలిక అధ్యక్షుడు హన్ డక్ సూ తెలిపారు. మంటలను ఆర్పేందుకు 130 హెలికాప్టర్లు, 4650 మంది సైనికులు, అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్నారని అన్నారు.

## పాక్షిక యుద్ధ విరమణకు సిద్ధమే

(మొదటిపేజీ తరువాయి)

ఆయుధాలు కూడా ఇవ్వాలని అడుగుతానన్నారు. శాంతి ఒప్పందాల్లో భాగంగా నల్లసముద్రంలో సురక్షితమైన వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు, వాణిజ్య నౌకలను సైనిక అవసరాలకు వినియోగించకుండా నిలువరించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయని తెలిపారు. ఈ ఒప్పందాలను రష్యా గౌరవిస్తుందని తాను నమ్మనని, షరతులను ఆ దేశం వక్రీకరిస్తోందని ఆరోపించారు. నిబంధనలను రష్యా ఉల్లంఘిస్తే.. ఆ దేశానికి సైనిక సాయం నిలిపివేసి.. అదనపు ఆంక్షలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కోరతానని జెలెన్‌స్కీ చెప్పారు. ఉక్రెయిన్‌లోని అన్ని అణు విద్యుత్తు ప్లాంట్లను అమెరికా స్వాధీనం చేసుకుంటుందంటూ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై ఆయన భిన్నస్వరం వినిపించారు. చర్చల్లో కేవలం జపోరిజియా మాత్రమే ప్రస్తావనకు వచ్చిందని తెలిపారు. తమ ఇంధన సదుపాయాలపై రష్యా ఎలాంటి దాడులు చేసినా దానికి దీటుగా స్పందనను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

**ఉక్రెయిన్‌వాసులపై ఉగ్ర అభియోగాలు**

తమకు బందీలుగా దొరికిన 23 మంది ఉక్రెయిన్‌వాసులపై ఉగ్రవాద అభియోగాల కింద రష్యా సైనిక న్యాయస్థానం 13 నుంచి 23 ఏళ్ల వరకు శిక్షలు విధించింది. ఇది సిగ్గుచేటైన విషయమని, అంతర్జాతీయ నియమాల ఉల్లంఘన కిందికి వస్తుందని ఉక్రెయిన్ మండిపడింది. 2022లో అజోవ్‌స్తల్ ఉక్కు పరిశ్రమలో పట్టుబడినవారిని, వివిధ పనులు చేసుకుని బతికేవారిని ఉగ్రవాదులుగా చూపించడం ఏమిటని రష్యాకు చెందిన మానవ హక్కుల సంస్థ 'మెమోరియల్' ప్రశ్నించింది.

## అపచారం.. అపచారం..

(మొదటిపేజీ తరువాయి)

వచ్చాక గుర్తించింది. రెండు రోజుల క్రితం జరిగిన తితిదే బోర్డు సమావేశంలో ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు మాట్లాడుతూ, ఇకపై ఆ 'దాత' దానాలు అక్కర్లేదని, అతని సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టామని చెప్పడంతో ఇన్నాళ్ల దారుణం వెలుగుచూసింది. వైకాపా పాలనలో శ్రీవారికి సమర్పించే ప్రసాదాల తయారీలో వాడే ముడి సరకులు, దినుసులన్నీ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి అయినవే తీసుకోవాలని 2021లో నిర్ణయించారు. అమలాపురం ప్రాంతానికి చెందిన నిమ్మకాయల సత్యనారాయణ అనే రొయ్యల ఫీడ్ వ్యాపారి 'శ్రీనివాసా సేవా ట్రస్ట్' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను తెరపైకి తెచ్చారు. తాను ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తితిదేకు సరఫరా చేస్తానని ముందుకొచ్చారు. అయితే వాటిలో సాధారణ నిత్యావసరాలనూ కల్తీ చేసి సరఫరా చేశారు. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఏఈవో వెంకయ్యచౌదరి బాధ్యతలు చేపట్టాక వీటి నాణ్యతపై ల్యాబ్‌లో పరీక్షలు చేయించడంతో అక్రమాలు గుట్టు వీడింది.





తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న 19 ఏండ్ల యువకుడికి, నిమ్స్ డాక్టర్లు పునర్జన్మను ప్రసాదించారు. కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ, డాక్టర్ అమరేశ్ రావు నేతృత్వంలోని వైద్య బృందం శుక్రవారం శస్త్ర చికిత్సను పూర్తి చేశారు. ఆరోగ్యశ్రీ కింద అనిల్‌కుమార్‌కు ఉచితంగా గుండె మార్పిడి చేశారు, ప్రస్తుతం అతను పూర్తిగా కోలుకోవడం వలన డిశ్చార్జి చేస్తున్నాం అని కార్డియో తొరసిస్ విభాగాధిపతి డా. అమ్రేష్ రావు, డా.గోపాల్, డా. కళాధర్ తెలియజేశారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప గారు సిబ్బందికి అభినందనలు తెలిపారు.



# జిల్లాలో వైద్య ప్రమాణాలు మెరుగు

* **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, (సమయం న్యూస్)** : జిల్లాలో వైద్య ప్రమాణాలు మెరుగుఅయ్యానని చెప్పడంలో వైద్యాధికారుల పనితీరు నిదర్శనం అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు.దవాఖానలోని ఓపీ రిజిస్టర్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు అత్యుత్తమ, నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ఆసుపత్రిలోని విభాగాల మెరుగైన నిర్వహణకు తార్కాణాలుగా పేర్కొన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక పరికరాలు, మౌలిక సదుపాయాలు, వసతులతో జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నారు. అని



చెప్పారు. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని ఇన్ పేషెంట్ వసతుల విషయంలో బెడ్లు బెడ్ షీట్లు మరుగుదొడ్లు, మెరుగుపరుస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం క్లస్టర్ వారీగా తీసుకుని హెడ్ క్వార్టర్ లో ఉండే మహిళలే కాకుండా సదూర ప్రాంత మహిళలకు కూడా ఈ సదుపాయం అదే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

* **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

నిజామాబాద్, మార్చి 26 (సమయం న్యూస్) : రైతుల ప్రయోజనార్థం జిల్లాలో యాసంగి సీజన్ కు సంబంధించిన వరి ధాన్యం సేకరణ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు కంట్రోల్ రూమ్ 08462 220183 నెంబర్ కు సంప్రదించి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు అందించవచ్చని సూచించారు. ప్రతి రోజు ఉదయం 8.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు కంట్రోల్ రూమ్ పని చేస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి పూర్తి స్థాయి మద్దతు ధర పొందాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రైతులకు హితవు పలికారు. కాగా, రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లు 180042500333 / 1967 లను కూడా సంప్రదించవచ్చని సూచించారు.

# భరోసా షీ టీం కేంద్రాలను సందర్శించిన క్రైమ్స్ డిసిపి

వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్ డిసిపి గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన బి జనార్ధన్ మంగళవారం రంగంపేటలోని భరోసా మరియు షీ టీం కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ సువర్ణ, సుజాతలు పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం లైంగిక దాడులకు గురైన మహిళలు బాలికలు యువతలకు భరోసా కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను రెస్పెక్టర్ సువర్ణ డిసిపికి వివరించారు.అలాగే షీ టీం పనితీరు తో పాటు మహిళల భద్రత




కోసం తీసుకున్న చర్యలు అలాగే చర్యలపై ప్రజలకు అవగాహన కోసం చేపడుతున్న కార్యక్రమాలపై ఇన్స్పెక్టర్ సుజాత డిసిపికి వివరించారు

## శానిటేషన్ లో
# పిన్ పాయింట్ ప్రోగ్రాం ను అమలు చేయాలి

: **బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే**

* **పిన్ పాయింట్ ప్రోగ్రాం షెడ్యూలు పాటించని జవాన్ కు షోకాజు నోటీసు...**
* **ట్రేడ్ ఆస్తి పన్ను వసూళ్ల తీరు పరిశీలన....**

**గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ మార్చి26 (సమయం న్యూస్) :** సమర్థ శానిటేషన్ నిర్వహణలో భాగం గా శానిటేషన్ అధికారులు సిబ్బంది పిన్ పాయింట్ ప్రోగ్రాం ను అమలు చేయాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధి 61 వ డివిజన్ సిద్ధార్థ నగర్ లో బుధవారం కమిషనర్ సానిటేషన్ తో పాటు



ట్రేడ్,ఆస్తి పన్నుల వసూళ్ల తీరును క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శానిటేషన్ పిన్ పాయింట్ ప్రోగ్రాం ను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన జవాన్ కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి వార్డు లో పిన్ పాయింట్ ప్రోగ్రాం అమలు అయ్యేలా చూడాలని, పారిశుధ్య సిబ్బంది స్వీపింగ్, డ్రైన్ క్లీనింగ్ లకు చెందిన లాగ్ బుక్ ఖచ్చితం గా నిర్వహించేలా చూడాలని, సమయ పాలన పాటించాలని, ప్రతి చెత్త తరలింపు వాహనం రెండు ట్రిపు లు వేయాలని అన్నారు. ఆస్తి, ట్రేడ్ పన్ను వసూళ్లకు ఏర్పాటు చేసిన బృందాలు ఖాజీపేట పరిధి లో 6 బృందాలు, కాశీబుగ్గ పరిధిలో ఏర్పాటు చేసిన 5 బృందాలు ప్రతి రోజు రూ. 50 లక్షల చొప్పున ఆస్తి, ట్రేడ్ పన్నులు వసూళ్లు జరుపుతూ, దానికి సమాంతరంగా శానిటేషన్ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. సిద్ధార్థ నగర్ లో రోడ్డు మీద ఇసుక వేసి నిర్మాణం చేస్తున్న యజమానికి పెనాల్టీ విధించాలని కమిషనర్ సి ఎం హెచ్ ఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి శానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేయర్ ను కలిసిన ఇండియనా ప్రతి నిధుల బృందం

**హైదరాబాద్, మార్చి26 (సమయం న్యూస్) :** జిహెచ్ఎంసి తో అమెరికా దేశానికి చెందిన ఇండియనా స్టేట్ తో 2010 సిస్టర్ సిటీ ఒప్పందం చేసుకున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ఆ చెందిన ప్రతినిధి బృందం హైదరాబాద్ వచ్చిన సందర్భంగా బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆ బృందాన్ని సాదరంగా ఆహ్వానించి ధన్యవాదాలు తెలిపారు. సిస్టర్ సిటీ ఒప్పందంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇండియానా ప్రతి నిధులు మేయర్ కు వివరించారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం హైదరాబాద్ గతంలో కంటే అభివృద్ధి చెందినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ పరిధిని పెంచి గ్లోబల్ సిటీ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అంతే కాకుండా హైదరాబాద్ చుట్టూ మరొక ట్రిబుల్ ఆర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉత్తరం వైపు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ప్రజా పాలన రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్ఎంసి లో మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణకు రూ. 7032 కోట్లతో రోడ్డు వెడల్పు, ఫ్లై ఓవర్లు నిర్మాణాలు చేపట్టి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు ఇట్టి పనులు పూర్తయితే గ్లోబల్ సిటీ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నగరంలో పాఠశాల విద్యా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ప్రతి




నిధులను మేయర్ కోరగా సానుకూలంగా స్పందించి అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తామని వారు మేయర్ కు వివరించారు. ఇండియానా పోలీస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ డియాగో మోరల్స్, చింతా ల రాజు, చీఫ్ అడ్వైసర్ ఆఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం రాష్ట్రరాష్ట్ర పర్యటనకు మేయర్ ను ఆహ్వానించారు తప్పకుండ మా గెలిగేట్ తో వస్తామని ఆహ్వానించినదుకి మేయర్ ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

* **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ**
* **ఎండల తీవ్రత దృష్ట్యా తిసుకోవాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులు నియంత్రణ ప్రణాళికపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన అదనపు కలెక్టర్**

**పెద్దపల్లి, మార్చి 26:( సమయం న్యూస్) :** ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ దిశగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎండల తీవ్రత దృష్ట్యా చేసుకోవాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులు నియంత్రణ ప్రణాళికపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ మాట్లాడుతూ, రాష్ట్రం లోనే అత్యధికంగా ఉష్ణోగ్రతల నమోదు జిల్లాలలో పెద్దపల్లి



మూడవ స్థానంలో ఉందని , ప్రజలు వడగాల్పుల బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎండ తీవ్రత వల్ల శరీరంలో నేటి శాతం తక్కువైతే ప్రజలకు వడ దెబ్బ తగిలే అవకాశం అధికంగా ఉంటుందని, మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండడం ఉత్తమమని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పనుల పని వేళలు మార్చాలని అన్నారు. ఆశా కార్యకర్తల నుంచి జిల్లా అధికారుల వరకు ప్రతి ఒక్కరి వద్ద అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. జిల్లాలో జరిగే వివిధ పంట కొనుగోలు నేపథ్యంలో రైతులకు, హమాలీ కూలీలకు, అక్కడి సిబ్బందికి వడదెబ్బ తగలకుండా ఏర్పాట్లు ఉండాలని, అవసరమైన టెంట్, త్రాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకేట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. నీటి పారుదల శాఖ, పంచాయతీ, వివిధ శాఖల కింద జరిగే పనులు దగ్గర కార్మికులకు వడదెబ్బ తగలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని అన్నారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో చల్లి వేంద్రం ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. వేసవి కాలంలో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. వడగాల్పుల వల్ల వచ్చే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వేసవి కాలంలో ప్రతి రోజు నీరు త్రాగడం, గొడుగు తీసుకుని బయటికి రావడం, వేడి గాల్పులు వచ్చే సమయంలో ఇంట్లో ఉండటం వంటి వివిధ అంశాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో తీసుకోవాలని అదనపు సూచించారు. గతంలో అధికంగా ఫీవర్ కేసులు నమోదైన ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నీరు నిల్వ ఉండకుండా గుంతలు పూడ్చి వేత కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఇంటిలో పాత కూలర్లు టైర్ల లో నీటి నిల్వలను తీసి వేయాలని అన్నారు. గ్రామాలలో రెగ్యులర్ ఫాగ్గింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# పర్యావరణ విధ్వంసం !

దేశంలో ఎండలు ముదరుతున్నాయి. పట్టణాల్లో ఎండల తీవ్రత తీవ్రంగా ఉంటోంది. గ్రామాల్లోనూ ఎండలు మంటపుట్టిస్తున్నాయి. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో ఇంటిముందున్న చెట్లను నరికి వేస్తున్నారు. కోతుల బెడ నుంచి ఇప్పటికి రక్షణకు కార్యాచరణ కానరావడం లేదు. అడవులను వదిలి అవి గ్రామాల్లో తిష్టవేశాయి. ఇక ప్రజలు మొక్కల పెంపకాన్ని వదిలి చల్లదనం కోసం కూలర్లు, ఎసిలు వాడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఇదే సందర్భంలో కాలుష్యాన్ని కొని తెచ్చుకుంటున్నాం. మొక్కలు నాటడం,పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న విషయాలను పక్కన పెట్టారు. ఇదంతా ప్రభుత్వాల పని అన్నట్లుగా ప్రజల భావన ఉంది. అందమైన ఇల్లు కట్టుకుంటున్న వారు సైతం నాలుగు మొక్కలు నాటాలన్న స్పృహ లేకుండా పోతున్నది. మొక్కలు నాటేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఫోటోలకు పోజులిచ్చే కార్యక్రమంగా మారింది. తమ ఇళ్లల్లోనే ఓ మొక్కను నాటి గ్రీన్ ఛాలెంజ్ అంటూ ఇంతకాలం ప్రచారం చేసుకున్నారు. నిజానికి గ్రీన్ ఛాలెంజ్ అంటే గ్రామాల రూపురేఖలు మారాలి. కానీ అలా జరగడం లేదు. హరితహారంలో 200 కోట్లమొక్కలు నాటామిన ఘనంగా చెప్పిఉకున్న బిఆర్ఎస్ పాలకులు వాటి ఆనవాళ్లు ఎక్కడో చూపితే బాగుండేది. అలా జరిగితే కనీస మార్పు వచ్చి ఉండేది. చంద్రబాబు ఉమ్మడి ఎపిలో ఇలాంటి ప్రచారాలే చేసినా ఎక్కడా మొక్కల జాడలేదు. ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు పర్యావరణ విధ్వంసానికి కారణమవుతున్నాయి. వాగులూవంకల జాడలేకుండా పోయింది. కొండలు, గుట్టలను తవ్వేస్తున్నాం. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటిలే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. అంటువ్యాధుల నివారణకు పరిశుభ్రత ముఖ్యమని హెచ్చరి స్తున్నా ప్రజలు చలించడం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకుంటున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికి వేస్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు పలు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవు తుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. అకాల వర్షాలు..తట్టుకోలేని ఎండలు..తట్టుకోలేని చలిగాలులు మనలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పాలకులకు ఇవేవీ పట్టడం లేదు. ఎందుకంటే ఉన్నన్నాళ్లూ పదవి అనుభవించి.. తదుపరి ఏమైతే మాకేంటన్న ధోరణిలో ఉన్నారు. కోట్లాదిమంది చేస్తున్న విధ్వంసం అంటే ప్లాస్టిక్ వాడిపడేం, చెత్తాచెదారం తీసివేయడం వేలల్లో ఉన్న పారిశుధ్య సిబ్బందికి సాధ్యం కాదు. కనీసం ఇక్కడైనా ప్రజలను కట్టుబాట్లు పెట్టివుంటే బాగుండేది. ప్రజలు పారిశుధ్య పనులు లాంటివి ఎందుకనో చేయడం లేదు. దీంతో కాలుష్యం మళ్లీ పెరుగుతోంది. ఎక్కడిక్కడ చెత్తకుప్పలు పేరుకు పోతున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో కాలువల్లో అవన్నీ నిండి మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా తయారయ్యింది. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలు కూడా చెత్తను బయటకు విసిరేసి చోద్యం చూస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో కాలం గడిపేస్తున్నారు. చెత్త పేరుకుపోయిందని ..అందుకు ప్రభుత్వానిదే బాధ్యతన్నట్లుగా దీరాలు తీస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం లాంటి విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దగా పట్టింపు లేకుండా ఉన్నాయి. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా.. భూగర్భ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటికాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. పర్యావరణ విధ్వంసం పై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగిపోతున్నాడు. ఎండ వేడిమి, వడగాడ్పులతో ప్రజలు అల్లాడి పోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడు చలికాలం వణికిస్తే.. ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు మనం చేస్తున్న విధ్వంసం కారణమని గుర్తించడం లేదు. పాలకులతో పాటు.. ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుం డటంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనిని కనీసం కొంతయినా తగ్గించడానికి కొంతమేరకు అయినా పరిసరాల పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలి. ఇందుకోసం నిరంకుశంగా అయినా ప్రభుత్వాలు ప్రజలను హెచ్చరించాలి. ప్రచండ భానుడి ప్రతాపానికి దేశం అల్లాడుతోందని ఊరుకుంటే ఇకముందు కూడా ఇలాగే ఉంటుంది. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకుంటున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తు న్నారు. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నది అలవాటు కావాలి.

## చెల్పూర్‌లో పడవ తరగతి పరీక్ష కేంద్రాన్ని
# ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాల్ పల్లి మార్చి26 (సమయం న్యూస్):** పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం గణపురం మండలం చెల్పూర్ జడ్పిఎస్ఎస్, అలాగే మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి రీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ అన్ని గదులను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, వైద్య తదితర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెడెంట్లకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలు, పరీక్షా కేంద్రాలోని ఏర్పాట్లును కలెక్టర్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన రికార్డులను, ప్రశ్న పత్రాలు, పరీక్షల అనంతరం జవాబు పత్రాల తరలింపుకు సంబంధించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21వ తేదీ నుండి ప్రారంభమైన 10వ తరగతి పరిక్షలు ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని పరీక్షలు చాలా ప్రశాంతంగా జరిగాయని, తదుపరి జరుగనున్న పరీక్షలు కూడా ఇదే స్పూర్తితో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరీక్షలు జరుగుతున్న తీరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సెల్ ఫోన్స్, వాచీలు, ఎలక్ట్రానిక్. పరికరాలు పరీక్ష కేంద్రాల్లోకి తీసుకురాకుండా నిశితంగా పరిశీలించాలని అన్నారు.మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు పాల్పడితే మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ చేయాలని అధి కారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు ముగిసేంత వరకు కూడా ఎంతో అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రశ్నప త్రాలను తప్పనిసరిగా తగిన పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య క్లోస్డ్ వాహనంలో తరలించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, చీఫ్ సూపరిం టెండెట్స్, తదితరులున్నారు.

# ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించుటకు కృషి చేయాలి

*** జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాల్ పల్లి మార్చి 26(సమయం న్యూస్) : ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమర్థంగా, సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం గణపురం తహసీల్దార్ కార్యాలయంలో నూతన రేషన్ కార్డులు విచారణ, త్రాగు, సాగు నీరు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై రెవెన్యూ, పంచాయతి రాజ్, ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సంబంధిత శాఖల అధికారులు తమ తమ విభాగాలకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితిని వివరించారు. ప్రజలకు అందుతున్న సేవలను మరింత మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యంగా తాగు, సాగునీటి సమస్యల పరిష్కారం, ఉపాధి హామీ పనుల పురోగతి, రేషన్



కార్డుల జారీ ప్రక్రియ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ వేగవంతంపై అధికారులు దృష్టి సారించాని తెలిపారు. పంట పొలాలు ఎండిపోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి వారం సాగు నీటిపై మండల స్థాయిలో యాసంగి పంటకు నీటి నిర్వహణపై సమీక్షించ నిర్వహించి సమస్య పరి ష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. యాసంగి పంటకు నీటినిర్వహణపై ప్రతి మండలంలో రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు సాగునీటి పంటకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాగునీరు సమస్య ఎక్కడ వచ్చే అవకాశం ఉంటుందో నీటి పరిష్కారానికి రైతులను భాగస్వామ్యం చేసుకుంటూ అవసరమైన చర్యలను అధికారులు సమన్వయంతో తీసుకోవాలని అన్నారు. రైతులకు నీటి షెడ్యూల్ పై సమాచారం అందించాలని అన్నారు. పంటల సంరక్షణ కు అధికారులు కృషి చేయాలని అన్నారు. సాగునీరు విషయమై వచ్చే అంశాలపై దృష్టి పెట్టాలని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, నీరు అందేలా చూడాలని అన్నారు. నీటి కాల్వల వద్ద నీటిని బ్లాక్ చేయకుండా చూడాలని, ఎక్కడైనా గేట్ బ్లాక్ చేస్తే వెంటనే అధికారులను సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని అన్నారు. నూతన రేషన్ కార్డులు ధరఖాస్తులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, పంచాయతి, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు
# పెంచే విధంగా నిజాయితీగా పనిచేయాలి

*** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

హన్మకొండ మార్చి26, (సమయం న్యూస్) : పోలీసుల గౌరవ మర్యాదలు పెంపోందించే విధంగా నిజాయితీగా పోలీస్ అధికారులు పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం తొలిసారి అత్మకూర్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ రోజు ఉదయం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో ఏర్పాటు సిసి కెమెరాల కంట్రోల్ రూంలోని సిసి కెమెరాల పనితీరు, స్టేషన్‌లోని వివిధ రికార్డు గదులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులను తనీఖీ చేయడంతో పాటు, స్టేషన్ పనీతీరుతో పాటు, స్టేషన్ పరిధిలో ఏలాంటి నేరాలు జరుగుతాయి, ఎంత మంది రౌడీ షీటర్లు వున్నారు, రోజు ప్రమాదాల సంఖ్య, పోలీస్ స్టేషన్ పరిధి, స్టేషన్ సిబ్బంది మొదలైన వివరాలను ఇన్స్‌స్పెక్టర్ సంతోష్‌ను పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా నిజాయితీ పనిచేయాలని, ఫిర్యాదులుపై వేగంగా స్పందించాలని, ముఖ్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ భూపాలపట్నం ప్రధాన రోడ్డు మార్గం వుండటం ద్వారా ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా వుండాలని పోలీస్ కమిషనర్ సూచించారు.పోలీస్ కమిషనర్ వెంట ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్ కుమార్, ఏసిపి సతీష్‌బాబు పాల్గొన్నారు.



*** కంఠాత్మకూర్‌లో పోలీస్ చెక్‌పోస్ట్‌ను సందర్శించిన సిపి**

అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేసేందుకు ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ డిసిపి అంకిత్‌కుమార్‌తో కల్సి మంగళవారం సందర్శించారు.ఈ సందర్బంగా చెక్‌పోస్టులో విధులు సిబ్బంది వివారాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, రోజు మొత్తం మీద ఎన్ని వాహనాలు తనీఖీ చేస్తారు. అలాగే అనుమతులు వున్న ఇసుక వాహనాలను ఏవిధంగా తనీఖీలు నిర్వహిస్తారని చెక్‌పోస్ట్ సిబ్బంది పోలీస్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెక్‌పోస్టు సిబ్బంది తనీఖీ తీరును సిపి ఎదుట ప్రత్యక్షంగా ప్రదర్శించారు.

# జర్నలిస్టుల సంక్షేమంపై దృష్టి పెట్టండి

*** టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్**

**సమయం న్యూస్:** తమ సమస్యలకు ప్రస్తుత ప్రభుత్వం పరిష్కారం చూపుతుందనే ఆశలతో జర్నలిస్టులు వేచి చూస్తున్నారని, ఇందుకుగాను ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల సంక్షేమంపై ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ సూచించారు. బుధవారం నాడు మునుగోడు నియోజకవర్గంలోని చండూరులో రాజశ్రీ బాంక్వెట్ హాలులో జరిగిన యూనియన్ నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర విభజనతో తమ జీవితాల్లో వెలుగు ప్రసాదించబడుతుందని ఆశించిన జర్నలిస్టులకు నిరుత్సాహమే మిగిలిందని, ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన కష్టాలనే జర్నలిస్టులు నేడు అనుభవిస్తున్నారని విరాహత్ విచారం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల కనీస అవసరాలను కూడా పాలకులు విస్మరించడం సహించరానిదన్నారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వ హయాంలో మిగిలిన నిరుత్సాన్ని ప్రస్తుత ప్రభుత్వం తొలగించి యుద్ధ ప్రాతిపదికన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆరోగ్య పథకం, విద్య, ఇంటి స్థలాలు, ఇండ్లు తదితర హామీలను నెరవేర్చాలని విరాహత్ కోరారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్ కార్డులను మే మాసంలో అందించడానికి చర్యలు ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. జిల్లాల్లో తమ యూనియన్ సభ్యత్వాల సేకరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని, జూన్ మసాంతరం కల్లా ఆయా జిల్లాల్లో మహాసభలు నిర్వ హించనున్నట్లు ఆయన స్పష్టం చేసారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా రాష్ట్ర రథసారథిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి నల్ల గొండ జిల్లాను పర్యటించిన విరాహత్ అలీకి, నల్లగొండ, మునుగోడు, మిర్యాలగూడ, దేవరకొండ నియోజకవర్గాల యూనియన్ బాధ్యులు ఘనంగా సత్కరించారు.



# రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**: జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతూ**

**నిజామాబాద్ మార్చి26, ( సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రాజీవ్ యువ వికాసం" స్వయం ఉపాధి పథకాలకు నిజామాబాద్ జిల్లాలోని ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగ యువతి / యువకులు ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక రేషన్ కార్డుకు ఒకరు మాత్రమే అర్హులని ఈ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు ఋణం అందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయేతర పథకాలకు 2155 ఏళ్ళ వయస్సు, వ్యవసాయ ఆధారిత పథకాలకు 2160 ఏళ్ళ వయసు ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయము రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలు వారు అర్హులని బ్యాంక్ సమ్మతి తప్పనిసరిగా కావలని అన్నారు. దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, విద్యార్హతలు, బ్యాంక్ ఖాతా ప్రతులను తప్పనిసరిగా జత చేయవలెను. ప్రభుత్వం నిర్ణయించిన ఏదో ఒక అంశాలలో ఎన్నుకొని స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తు చేసుకోవలెను. OBMMS లో పూర్తి చేసిన ధరఖాస్తులను అర్జీదారు డౌన్ లోడ్ చేసుకొని దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, విద్యార్హతలు, బ్యాంక్ ఖాతా ప్రతులను జత చేసి సంబంధిత మండల ఎంపిడిఓ లకు మరియు మున్సిపల్ కమీషనర్ల కార్యాలయములో అందజేయాలన్నారు. ఆసక్తి గల షెడ్యూల్డ్ కులాలకు చందిన నిరుద్యోగ యువతి యువకులు ఏప్రిల్ 5వ తేదీలోగా https://tgobmms.cgg.gov.in నందు ధరఖాస్తు చేసుకోవాలని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



# ఓటిఎస్ ను సద్వినియోగం చేసుకోండి

**: బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే**

* **ఇకా కేవలం 4 రోజులు మాత్రమే....**
* **అవకాశాన్ని వినియోగించుకోండి.**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మార్చి26, ( సమయం న్యూస్) : వన్ టైం సెటిల్మెంట్ (ఓటిఎస్) స్కీమ్ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని పన్ను పై 90% వడ్డీ మాఫీ పొందాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ 2024..25 ఆర్థిక సంవత్సరం నకు చెందిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే, ఆస్తి పన్నుపై 90% పేరుకుపోయిన బకాయి వడ్డీని మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 మార్చి 31 వరకు వడ్డీ/పెనాల్టీలతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలను ఒకేసారి చెల్లించిన పన్ను చెల్లింపుదారులకు సంబంధించి, బకాయిలపై 90% వడ్డీ/పెనాల్టీలను మాఫీ చేయడం జరుగుతుందని, ఇదివరకే పన్నులు చెల్లించిన వారికి భవిష్యత్తు చెల్లింపులతో సర్దుబాటు చేయాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగిందని, ఈ సువర్ణావకాశం కేవలం 4 రోజులు మాత్రమే వర్తిస్తుందని, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.



# ఘనంగా ప్రారంభమైన శ్రీ భ్రమరాంబా సహిత మల్లికార్జున 48 వ వార్షికోత్సవాలు

* **విద్యుత్ దీపాలతో పుష్పాలతో అందంగా ముస్తాబైన ఆలయం**
* **మూడు రోజులపాటు కొనసాగుతున్న కళ్యాణ మహోత్సవం**

**వెల్దుర్తి మార్చి 26 ( సమయం న్యూస్) :** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వెల్దుర్తి మండలం బస్వాపూర్ గ్రామంలో శ్రీ భ్రమరాంబా సహిత మల్లికార్జున 48వ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమం బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఉదయం ఆలయంలో ఆలయ పూజారులు బసవప్ప ఫణి పంతులు ఆధ్వర్యంలో, పంచామృతాభిషేకం గణపతి హోమం, అఖండ దీపారాధన, కంకణ ధరణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని అందంగా ముస్తాబు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో మూడు రోజులపాటు జాతర ఉత్సవం కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయ ప్రాంగణంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జాతర మహోత్సవాన్ని విజయవంతం చేసి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రముఖులు భక్తులు తదితరులు పాల్గొన్నారు





# ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలు అందించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలి

* **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
* **ప్రభుత్వ భూములలో ఆక్రమణల తొలగింపుకు కట్టుదిట్టమైన చర్యలు**
* **మంథని, ముత్తారం,కాల్వ శ్రీరాంపూర్ మండలాలలో పర్యటించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి, మార్చి26 (సమయం న్యూస్) :** రెవెన్యూ విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని, ముత్తారం,కాల్వ శ్రీరాంపూర్ మండలాలలో విస్తృతంగా పర్యటించారు. మంథని మండలంలోని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం, నిర్మాణం అవుతున్న నూతన పురపాలక భవన పనులను, ముత్తారం మండలం ధర్యాపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలను, వసతి గృహం, అక్కడ ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. మందని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్షిస్తూ, జాతీయ రహదారి 163 జీ క్రింద ముత్తారం మండలం లక్కారం గ్రామంలో సేకరించిన భూములలో ఉన్న నిర్మాణాలకు సంబంధించిన నగదు నిర్వాసితులకు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బోరు బావులు, చెట్లు, ఇతర నిర్మాణాలకు పరిహార నిధులు ప్రతిపాదనలను సంబంధిత అధికారులు వెంటనే జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ కు పంపి త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. డివిజన్ పరిధిలో భూ శుద్దీకరణ సమయంలో జరిగిన తప్పుల సరి చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు సర్వే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చెరువుల ఎఫ్టిఎల్ బఫర్ జోన్ పరిధి నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువు భూములలో ఆక్రమణలు ఎక్కడైనా జరిగితే వెంటనే రికవరీ చేయాలని అన్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములకు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మంథని పట్టణంలో నిర్మాణం అవుతున్న నూతన పురపాలక భవనం పనులు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే రోడ్డు అభివృద్ధి పనులను చేపట్టాలని, రోడ్డుకు ఇరువైపులా గ్రీనరీ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధర్యాపూర్ ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించి పిల్లల డార్మెంటరీ, భోజనశాల, వంటగది పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ముత్తారం మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూసేకరణ పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఆన్లైన్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కాల్వ శ్రీరాంపూర్ మండల హెడ్ క్వార్టర్ లో ఉన్న ప్రభుత్వ భూమి లను సందర్శించారు, ప్రభుత్వ భూములు ఎక్కడైనా కబ్జాకు గురైతే వెంటనే విడిపించాలని, కబ్జాదారుల చెర నుంచి భూమి తొలగించి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహసిల్దార్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మంథని తహసిల్దార్ గిరి, ముత్తారం ఎంపీడీవో సురేష్, ఎంపీఓ గోవర్దన్, కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జగదీశ్వర్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ సమతుల్యతను పెంపొందించాలి!

**: కలెక్టర్ ప్రావీణ్య**

**హనుమకొండ మార్చి26, (సమయం న్యూస్) :** "ఇంటర్ డిసిప్లినరీ మెటీరియల్స్ సైన్స్ ఫర్ సస్టేనబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్మెంట్ (ఎన్ సిఐఎం ఎస్ఎస్ఈఈ 2025) "అనే అంశంపై రెండు రోజుల నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డా. బి.చంద్రమౌళి అధ్యక్షత వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సదస్సులో ప్రసంగిస్తూ ఆధునిక ప్రపంచంలో సుస్థిరాభివృద్ధి సాధించుటకు వివిధ రకాల శక్తి వనరులను సంరక్షించుకోవడానికి,మరియు పర్యావరణ సమతుల్యతను పెంపొందించాలని,దాని కోసం మెటీరియల్ సైన్స్ దోహద పడుతుందని అన్నారు. నూతన ఆవిష్కరణలు సృజనాత్మక ఆలోచనా విదానాలతో సుస్తిరాభివృద్ధిలో భాగం కావాలని,వివిధ రకాల నైపుణ్యాలను వినియోగించుకొని లెర్న్ ఇట్ బై డూ ఇట్ అనే భౌతిక శాస్త్ర భావన ద్వార అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ప్రగతి పథంలో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ గారు కళాశాలను సందర్శించి కళాశాల గురించి ప్రస్తావిస్తూ నాక్ ఏ ప్లస్ ప్లస్ లేదా ఎక్సలెన్స్ గ్రేడ్ రావడానికి కావలసిన అన్నిరకాల వసతుల కల్పన,ముఖ్యంగా కళాశాల






అదనపు తరగతి గదులు,కళాశాలకు కావలసిన పోటీ పరీక్షల పుస్తకాల ఏర్పాటు, కళాశాలలో బొటానికల్ గార్డెన్ నిర్మాణం, విద్యార్థులకు వైద్య వసతి, సోలార్ ఎనర్జీ కల్పన, మంచినీటి సౌకర్యం, ఒకుడు గుంతల ఏర్పాటు, అడ్వాన్స్డ్ కంప్యూటర్ లాబ్ ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామనీ అట్లాగే కళాశాల వసతి గృహం పై అదనపు అంతస్తు నిర్మాణం కోసం సంబంధిత అధికారులు మరియు ప్రభుత్వంతో మాట్లాడి సహాయం చేస్తామని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మెటీరియల్ సైన్స్ లో నూతన ఆవిష్కరణల ద్వార వివిధ శక్తి వనరులను,పర్యావరణమును పరి రక్షించుకోవాలని అన్నారు. వరంగల్ ఎన్ఐటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి.హరినాథ్ కాన్ఫరెన్స్ లో కీలకోపన్యాసం చేస్తూ మెటీరియల్ సైన్స్ ను వినియోగించుకొని వివిధ రకాల ప్రాణుల ఆకారాల మాదిరితో బుల్లెట్ ట్రెయిన్, అత్యాధునిక వాహనాలను తయారుచేయడం జరిగిందన్నారు. సదస్సు కన్వీనర్ & అర్గనైజింగ్ సెక్రటరీ డా. పి.అరుణ జాతీయ కాన్ఫరెన్స్ యొక్క ప్రాధాన్యతను తెలియస్తూ పర్యావరణ స్పృహ సుస్తిరాభివృద్ధిలో నూతన సాంకేతికతలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఉపయోగపడుతున్నాయని అన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన వరంగల్ ఎన్ వై కె డిప్యూటీ డైరెక్టర్ సి హెచ్ అన్వేష్ మాట్లాడుతూ వివిధ రకాల స్కిల్స్ పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు శాస్త్ర విజ్ఞాన రంగంలో అగ్రగామిగా నిలవాలనీ,ఎలాన్ మస్క్ లాంటి ప్రపంచ దిగ్గజాల ఆలోచనా ధోరణిని అలవర్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అతిథులు ఫిజిక్స్ జాతీయ సదస్సు నిర్వాహకులను అభినందించారు. ఈ సదస్సులో 120 మంది రాసిన పరిశోధక పత్ర వ్యాసాలను ఐ ఎస్ బి ఎన్ తో సావనేర్ ను కలెక్టర్ అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.తదనంతరం అతిథులను పుష్పగుచ్ఛం, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.వివిధ కళాశాలల నుండి వచ్చిన ఉపన్యాసకులు,పరిశోధకులు,ఔత్సాహికులు టెక్నికల్ సేషన్ లో తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. ప్రత్యేకమైన ప్రదర్శనను ఏర్పాటు చేయగా ఇది అందరినీ అలరించింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కోకన్వీనర్ శ్రీమతి ఈ. కవిత, ఐ క్యూ ఏ సీ కోఆర్డినేటర్ డా .సురేష్ బాబు,అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం.అరుణ,అధ్యాపకులు హెప్సిబా,ప్రవీణ్ కుమార్ ,పద్మ, సుజాత, మధు, సారంగపాణి, రత్నమాల, సునీత, శ్రీలత, ఉదయశ్రీ, ప్రశాంతి, లక్ష్మీకాంతం, యుగంధర్, రాజు, రమేశ్ కుమార్ , రాజిరెడ్డి, రాజేశ్వరి, మమత, బాలరాజు, లకన్ సింగ్, సుభాషిణి, సుమలత, సమత, సురేష్, రాజ్ కుమార్, భారతి, కృష్ణ, మరియు భోధన బోధనేతర సిబ్బంది, ఇతర కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**రంజాన్ ఉపవాస దీక్షల విరమణ సందర్భంగా బుధవారం బంజారాహిల్స్ రేనోవ హాస్పిటల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గారు పాల్గొన్నారు. ముందుగా జరిగిన ప్రార్ధనలలో పాల్గొన్న మేయర్,అనంతరం పలువురికి ఖర్జూర ఇచ్చి దీక్ష విరమింప చేస్తూ ముస్లిం సోదరులకు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేశారు.**

## 'మానవతా సదన్'

# చిన్నారులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

* ఆకాంక్షించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**నిజామాబాద్, మార్చి 26, సమయం న్యూస్ :** డిచ్పల్లిలోని మానవతా సదన్ చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆకాంక్షించారు. డిచ్పల్లి టోల్ వే (అథాంగ్) ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సుమారు 45 లక్షల రూపాయలను వెచ్చిస్తూ మానవతా సదన్ లో నూతనంగా వివిధ సదుపాయాలను సమకూర్చడం జరిగింది. స్టడీ రూమ్, రెండు టాయిలెట్లు, ఫ్రిడ్జ్, భారీ స్క్రీన్ తో కూడిన టెలివిజన్, సదన్ ఆవరణలో ఆర్.సి.సి సిట్టింగ్ బెంచీలు, వంట పాత్రలు, ఇతర సామాగ్రిని సదన్ కు వితరణ చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం మానవతా సదన్ ను సందర్శించి, నూతన నిర్మాణాలు, వస్తువులకు లాంఛనంగా ప్రారంభోత్సవాలు చేశారు. సదన్ లోని కిచెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, డార్మెటరీ, ప్లే గ్రౌండ్, లైబ్రరీ తదితర వాటిని కలెక్టర్ సందర్శించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు.




సదన్ కు చెందిన బాలికలు ఎంతో అందంగా కుండలపై, గాజు సీసాలపై రూపొందించిన కళాకృతులను, ఆకట్టుకునే రీతిలో చిత్రించిన పెయింటింగ్ లను పరిశీలించి అభినందించారు. సదన్ నిర్వహణ తీరుతెన్నుల గురించి ఎంతో ఆసక్తితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అనాథ బాలలను అన్నివిధాలుగా ఆదుకునేందుకు వీలుగా ఇదివరకు జిల్లాలో కలెక్టర్ గా కొనసాగిన ప్రస్తుత రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా తన హయాంలో 2016లో నెలకొల్పిన మానవతా సదన్ రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుంటోందని అన్నారు. సదన్ లోని బాలలను సిబ్బంది తమ సొంత బిడ్డలుగా చూసుకుంటూ వారి అభ్యున్నతికి పాటుపడుతుండడం వల్ల అనేకమంది ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు చదువుతున్నారని అన్నారు. అందుబాటులో ఉన్న వనరులను, జిల్లా యంత్రాంగం తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఐ.ఏ.ఎస్, ఐ.పీ.ఎస్ లుగా కూడా రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, అంకిత భావం, ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. తాము అనాథలం, తమకు తల్లితండ్రులు లేరు అనే భావన పిల్లల దరి చేరకుండా వారికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు సమకూర్చేందుకు జిల్లా యంత్రాంగం చొరవ చూపుతోందని, ఈ దిశగా డిచ్పల్లి టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కూడా ముందుకు వచ్చి తోడ్పాటును అందించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరినప్పుడే మానవతా సదన్ ఆశయాలు, లక్ష్యాలు పూర్తి స్థాయిలో నెరవేరినట్లు అవుతాయని అన్నారు. అన్ని రంగాల్లో సత్తా చాటుతూ, ఇతరులకు ఆదర్శంగా నిలువాలని సూచించారు. సదన్ నిర్వహణకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, వాటిని పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం తరపున కృషి చేస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సదన్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మానవతా సదన్ లైజనింగ్ ఇంచార్జ్ సుధాకర్, కేర్ టేకర్ రమేష్, టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్, రిషా, రోడ్ సేఫ్టీ విభాగం అధికారి హర్ష, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



## నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ మార్చి,26 (సమయం న్యూస్) :** బుధవారం సాయంత్రం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలించారు. హౌస్ డిజైన్, ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై అధికారులకు కీలక సూచనలను చేసారు. నిర్మాణ నాణ్యతను మెరుగుపరచాలని, పనులను వేగంగా పూర్తి చేయాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇండ్లు లేని పేదవారికి ఇండ్లను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకు వచ్చిందన్నారు. అన్ని మండలాల్లో నిర్మించ తలపెట్టిన నమూనా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారుల సర్వే కొనసాగుతోందని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎంపీడివో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ, పట్టణ పరిధిలో ఆస్తిపన్ను వసులును వందశాతం పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. ఎల్ ఆర్ ఎస్ కు ఈనెల 31 వరకు గడవు ఉన్నందున దస్తుదారులు 25 శాతం లబ్ధి పొందేలా ఎల్ఆర్ఎస్ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వాగులు, నది పరివాహక ప్రాంతాలలో ఇసుక రీచ్ లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత, ఎంపీఓ రత్నాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేయాలి

* జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ

**ఒంగోలు మార్చి26 (సమయం న్యూస్):** క్షేత్ర స్థాయిలో రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు బాధ్యతగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీ ఆర్. గోపాల క్రిష్ణ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోనే పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు కింద రీ సర్వే, పి జి ఆర్ ఎస్, పలు రెవెన్యూ అంశాలపై జిల్లాలోని ఆర్డీవోలు, డిప్యూటీ సర్వే ఇన్స్పెక్టర్లతో జిల్లాలోని తహసీల్దార్లతో, జిల్లాలోని RSDT లు, మండల సర్వేయర్లకు, డిప్యూటీ తహసీల్దార్ల తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా తహసీల్దార్లు, మండల సర్వేయర్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. రీ సర్వే కార్యక్రమం పటిష్టంగా జరిగితే భూ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. మండల సర్వేయర్లు, గ్రామ సర్వేలుహద్దుల గుర్తింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూ యజమానికి ముందుగా రీ సర్వే గురించి తెలియజేయాలని సూచించారు. సర్వేలో తప్పులు లేకుండా అలాంటి పరిస్థితి రాకుండా ప్రస్తుత సర్వేలో ఉండొద్దని అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను ఇచ్చింది దానిని కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహించే ఆంధ్ర ప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు క్రింద జిల్లాలో ని 38 మండలాలలో 38 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసుకుని సర్వేను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆర్డీవోల ఆధ్వర్యంలో రీ సర్వే పై ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామ సరిహద్దులను గుర్తించి గ్రామంలోనీ అన్ని ప్రభుత్వ భూములను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వే కు సంబంధించి ఇచ్చిన ఎస్ఓపిని తూచా తప్పకుండా పాటించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. పీజీఆర్ఎస్ లో వచ్చిన వినతలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఆ సమస్యను పరిశీలించి, పిటిషనదారుడుతో మర్యాదపూర్వకంగా మాట్లాడి మీ సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మీ పిటిషన్ తిరస్కరించుచున్నామని కారణాలు తెలపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డిఓలు లక్ష్మి ప్రసన్న, కేశవర్ధన్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ అధికారి గౌస్ బాషా, జిల్లాలోని ఎమ్మార్వోలు, మండల సర్వేర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ మార్చి26 (సమయం న్యూస్) :** బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయితీ రాజ్ అధికారుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. వివిధ జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలంతా అన్ని పండుగలను కలిసికట్టుగా సహోదర భావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని మతాల సారం ఒకటేనని, ప్రజలంతా కలిసికట్టుగా ఉంటూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. సమాజ సేవ, దయాగుణం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. ముస్లింలకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రత్నకళ్యాణి, జిల్లా అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టీజీవో సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో ఇఫ్తార్ విందు

**నిజామాబాద్, మార్చి 26 ( సమయం న్యూస్):** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ముస్లిం ఉద్యోగులు, టీజీవో ప్రతినిధులతో కలిసి ఇఫ్తార్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నియమనిష్టలతో ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని



అన్నారు. వారి ప్రార్థనలు ఫలించి నిజామాబాద్ జిల్లా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గజిటెడ్ అధికారుల సంఘం ఏ కార్యక్రమం చేపట్టినా ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తుందని, ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తారని అభినందించారు. ముందు ముందు ఇదే తరహా స్ఫూర్తిని కనబరచాలని సూచించారు. టీజీవో సంఘం జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ, అన్ని మతాలకు సమ ప్రాధాన్యతను ఇస్తూ తమ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగుల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని అన్నారు. కాగా, రంజాన్ మాసం పవిత్రత' ప్రాశస్త్యం గురించి ముస్లిం మత పెద్ద మౌలానా హాఫిజ్ మొహమ్మద్ అబ్దుల్ ఖదీర్ తెలియజేశారు. ఇఫ్తార్ విందులో టీజీవో ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, లేబర్ ఆఫీసర్ యోహన్, డిసిఓ శ్రీనివాస్తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖకు రాష్ట్రస్థాయి అవార్డులు

మార్చి 26, 2025, నిర్మల్: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థకు 2 రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. బుధవారం హైదరాబాదు గచ్చిబౌలి లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో శ్రీనిధి 12వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 202324 ఆర్థిక సంవత్సరానికి గాను, శ్రీనిధి రుణాల వసూలు 88 శాతం, క్రెడిట్ ప్లాన్ అచీవ్మెంట్ లో 105 శాతం లక్ష్యాలను సాధించి ఉత్తమంగా నిలిచినందుకుగాను రాష్ట్రంలోనే రెండవ స్థానం అవార్డు లభించింది. లోకేశ్వరం మండలం ప్రగతి మండల సమాఖ్యకు ఉత్తమ మండల సమస్యగా రాష్ట్రంలో రెండు స్థానం దక్కింది. కాగా జిల్లాకు వరుసగా నాలుగో సం వత్సరం అవార్డు లభించింది. ఈ అవార్డులను డిఆర్డిఓ తరపున జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు సాగర, ఎపిఎం మల్లేష్ లు రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క, చేతుల మీదుగా అందుకున్నారు.

# వెల్దుర్తి గ్రామ పంచాయతీ లో తై బజార్ వేలం పాట..

**వెల్దుర్తి ( సమయం న్యూస్):** మార్చి 26 : వెల్దుర్తి గ్రామ పంచాయతీ తై బాజార్ వేలం పాట ను బుధవారం వెల్దుర్తి గ్రామపంచాయతీలో స్థానిక పంచాయతీ సెక్రెటరీ బలరాం రెడ్డి సమక్షంలో నిర్వహించారు. గత ఏడాది 7,35,000 పలికిన వేలంపాట ఈ ఏడాది కీ గాను పోటా పోటీగా సాగిన వేలం లో 10,67,000 కు గ్రామానికి చెందిన దండెం ఆదర్శ్ దక్కించుకున్నారు. రెం డవ పోటీ ధారుడిగా నీరుడి




భరత్ 10,66,500 గా నిలిచారు. ఈ కార్యక్రమంలో వేలం పాట సభ్యులు , గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## నర్సాపూర్ డివిజన్ ను చార్మినార్ జోన్ లో కలపాలి

నర్సాపూర్ మార్చి 26 (సమయం న్యూస్) : నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల (జోన్ 3) లో ఉండటంతో నర్సాపూర్ ప్రజలకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి అదనంగా నర్సాపూర్ ప్రాంతం రాజన్న సిరిసిల్ల జోన్ లో ఉండడం వలన అభివృద్ధి పరంగా వెనుకబడి పోతుందని డివిజన్ యువకులు ఆవేదన వ్యక్తం చేశారు, నర్సాపూర్ రెవెన్యూ డివిజన్ ని చార్మినార్(జోన్ 6) మరియు మల్టి జోన్ 2 లో విలీనం చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి ని హైదరాబాదులో ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు సార్వత్రిక ఉద్యోగ అవకాశాలపై తమకు ఎదురవుతున్న సమస్యలను వివరించారు, దీనిపై ఎమ్మెల్యే సునితా రెడ్డి సానుకూలంగా స్పందించి విధి విధానాలు తెలుసుకొని విలీన ప్రక్రియను ముందుకు పోవడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో చౌటి నవీన్ , భారత్ రాం, అభిరామ్ ,నవదీప్, ఓంకార్,ఉదయ్ కిరణ్,దీపక్,సుజిత్ లు పాల్గొన్నారు

# పంట పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభం..

* **పొంచి ఉన్న ప్రమాదం..**

**రాయపోల్. మార్చి, సమయం న్యూస్ 26 :** పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు కిందికి వంగి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ స్తంభం తో పాటు వైర్లు కిందికి వేలాడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన గురవుతున్నారు. రాయపోల్ . తిమ్మక్కపల్లి గ్రామాల మధ్య అనాజిపూర్ చెరువు ప్రక్కన ఉన్న పొలాలకు రైతులు ఆ దారి నుంచి వెళ్లాలంటే జంకుతున్నారు. నిత్యం అదే రూట్ లో వస్తున్న విద్యుత్ అధికారులు చూసి చూడనట్లు వివరిస్తున్నారని



రైతులు మండిపడుతున్నారు. పైన 11 కెవి విద్యుత్ స్తంభం ఒరిగి ఉండగా పైన 11 కేవీ విద్యుత్ వైరు ఉండడంతో ఎప్పుడు విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయో అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మనిషి వెళ్లడానికి వైర్లు కిందికి ఉండడంతో అటువైపు పోవడానికి భయపడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని సరిచేసి. కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లను మరమ్మతు చేసి ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు చేపట్టాలని రైతులు పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు.

# బిఆర్ఎస్ సీనియర్ నాయకుని పరామర్శించిన రణం

**కరాయపోల్, మార్చి 26, సమయం న్యూస్ :** ఉమ్మడి మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాయపోలు మండలం కొత్తపల్లి గ్రామానికి కర్నాల సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది బుధవారం ఇంటికి రావడంతో దుబ్బాక నియోజకవర్గం సమన్వయకర్త . నియోజకవర్గ సీనియర్ నాయకులు రణం శ్రీనివాస్ గౌడ్ ఆయనను పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సత్యనారాయణకు ధైర్యం చెబుతూ మీకు మేమంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. బిఆర్ఎస్ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చిన ఆదుకుంటామని పేర్కొన్నారు.



సీనియర్ నాయకులు సత్యనారాయణ అనారోగ్యానికి గురి కావడం పట్ల ఆయన విచారణ వ్యక్తం చేశారు. ఆయన వెంట గ్రామ అధ్యక్షుడు గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు దాసరి బుజ్జి. దౌల్తాబాద్ మండల మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు యాదవ రెడ్డి. మాజీ సర్పంచులు మోహన్ రావు. డాకూరి. చంద్రం. గ్రామ నాయకులు సత్యనారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు




## విద్యార్థులు చెడు అలవాట్లకు స్వస్తి చెప్పాలి

* **దౌల్తాబాద్ ఎస్సై ప్రేమ్ దీప్.**

**రాయపోల్ మార్చి,. సమయం న్యూస్ 26 :** విద్యార్థులు మంచిగా చదువుకొని ఉజ్వలమైన భవిష్యత్తు కోసం ముందడుగు వేయాలని దౌల్తాబాద్ ఎస్సై ప్రేమ్ దీప్ సూచించారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ మత్తు పదార్థాలు. సైబర్ నేరాలు. తదితర వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని జీవితంలో ఏదైనా సాధించుకోవాలని పట్టుదల ఉంటే ఎప్పటికైనా సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. మత్తు పదార్థాలు సెల్ ఫోన్లు. సైబర్ నేరాలకు. బెట్టింగులకు విద్యా ర్థులు దూరంగా ఉంటే ఎంతో మంచిదన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిపిస్తున్నారని వారి ఆశలను వారి ఆశలను వమ్ము చేయకుండా పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు గ్రామాలకు మండలానికి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి అనుకున్న లక్ష్యాన్ని విద్యార్థి ముందుకు సాగితే భవిష్యత్తులో మరింత సమాజంలో గౌరవం పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ పట్టుదల ఉండాలని చెడు అలవాటుకు దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు

## కెసిఆర్ హరీష్ రావులను విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదు

- **గజ్వేల్ ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్**

గజ్వేల్, మార్చి 26 : గత కాంగ్రెస్ పాలనలో మొదలుకొని ఈ 15 నెలల కాలంలో గజ్వేల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, కెసిఆర్ పదేళ్ళ కాలంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు చర్చకు రావాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ సవాల్ విసిరారు. బుధవారం గజ్వేల్ లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో గజ్వేల్ అభివృద్ధికి చేసింది శూన్యం అన్నారు. కెసిఆర్ పదేళ్ళ పాలనలో వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు కావాల్సిన బతుకుదెరువు మార్గాల్ని కూడా కెసిఆర్ కల్పించారన్నారు. గజ్వేల్ నేడు అన్నపూర్ణగా మారిందంటే దానికి కారణం కెసిఆర్ దూర దృష్టి మాత్రమే అని అన్నారు. కెసిఆర్ గారి పాలనలో మొదటి 5సంవత్సరాల అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కూడా సాక్షే అని గతంలో అనేక సందర్భాల్లో కెసిఆర్ చేసిన అభివృద్ధిని పొగిడిన సందర్భాలను మర్చిపోయారన్నారు . పెండింగ్ పనులను పదిహేను నెలల కాలంలో ప్రారంభించేందుకు ఎందుకు కృషి చేయడం లేదో చెప్పాలన్నారు. బస్టాండ్, డబుల్ బెడ్రూం, నిర్వాసితుల సమస్యల మీద పదే పదే మాట్లాడే కాంగ్రెస్ నాయకులు సమస్యల పరిష్కారానికి చేసిన ప్రయత్నం ఏముందని ప్రశ్నించారు.



పాదయాత్ర నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు పనులు మంజూరు చేయించినా బాగుండేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కెసిఆర్, హరీష్ రావు గారిమీద పొద్దుపోవడం మాని ప్రజల కోసం పని చేస్తే బాగుంటుందని లేనిపక్షంలో ప్రజా క్షేత్రంలో మీకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ కొమురయ్య, వైస్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, నాయకులు భాస్కర్, రామస్వామి యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను రైతులకు అందేలా చూడాలి

* **పదవీ బాధ్యతలు చేపట్టిన గజ్వేల్ ఆత్మ కమిటీ పాలకవర్గం**
* **సన్మానించిన టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు**



గజ్వేల్, మార్చి26: ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించి వారు వినియోగించుకునేలా చూడాలని గజ్వేల్ ఆత్మ కమిటీ నూతన పాలకవర్గానికి టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు సూచించారు. బుధవారం గజ్వేల్ లో ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, డైరెక్టర్లు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఏడిఏ బాబు నాయక్ బాధ్యతలు అప్పగించగా, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రావు మాట్లాడుతూ నూతన ఆత్మ కమిటీ పాలకవర్గం రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా రైతులు లబ్ధి పొందే విధంగా పనిచేయాలన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరు మల్లారెడ్డి మాట్లాడుతూ తనకు ఆత్మ కమిటీ అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ రావులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా నిర్వహించి రైతులకు సేవలు అందిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏవో నాగరాజు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆత్మ బిటిఎం ఎటిఎం లు పాల్గొన్నారు.




## తల్లి మానసిక శారీరక ఆరోగ్యంతో ఉంటేనే గర్భస్థ శిశువకు మేలు

- **గర్భిణీలకు అవగాహన కల్పించిన రామకృష్ణ మఠం వైద్యులు**

**గజ్వేల్, మార్చి26:** తల్లి మానసిక శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే గర్భస్థ శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదుగుతుందని ఆర్య జనని ట్రస్ట్ వైస్ చైర్మన్ పీడియాట్రిక్ డాక్టర్ అనుపమ రెడ్డి అన్నారు. పుట్టే పిల్లలు సంపూర్ణమైన మానసిక వికాసం తో పాటు శారీరక ఆరోగ్యం పొందడానికి తల్లి యొక్క ఆరోగ్య మానసిక పరిస్థితులు కారణం అవుతాయన్న అంశంపై రామకృష్ణ మఠం అనుబంధ సంస్థ అయిన ఆర్య జనని ట్రస్ట్,గజ్వేల్ హైందవ సోదరులు, ఆపన్న హస్త మిత్ర బృందం సౌజన్యంతో గర్భిణీలకు బుధవారం గజ్వేల్ లోని కోలాభిరామ్ గార్డెన్ లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుపమ కేర్ మాట్లాడుతూ గర్భంలోని శిశువును తల్లి ఆలోచనలు, చేసే పనులు మాట్లాడే మాటలు మానసిక స్థితి ఇవన్నీ కూడా ప్రభావితం చేస్తాయన్నారు. గర్భంలోని శిశువుకు అనుభవమయ్యే పరిస్థితిలే తర్వాత శిశు వ్యక్తిత్వాన్ని గుణ సంపదను నిర్ణయిస్తాయన్నారు. సంస్కారవంతులైన దైవం పట్ల భక్తిశ్రద్ధలు కలిగిన తల్లులు ఉన్న ఇండ్లలోనే ఉన్నతమైన వ్యక్తులు జన్మిస్తారని స్వామి వివేకానంద చెప్పారన్నారు. తల్లి భావోద్వేగాలు సంరక్షణ అంతులేని ఆనందం గర్భస్థ శిశువు యొక్క హృదయం మనసు పూర్తి వికాసం చెందడానికి ఉపకరిస్తాయన్నారు. సంతులనమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. చక్కని నడవడిక, మంచి అలవాట్లు, గర్భం దాల్చిన మహిళలు ప్రతి చిన్న విషయానికి ఆందోళన పడవద్దని, భవిష్యత్తులో బిడ్డ ఏ స్థాయిలో ఎదగాలనుకుంటుందో తల్లి ఆయా రంగాలకు సంబంధించిన అంశాలను వినడం అలవాటు చేసుకోవాలన్నారు.




## పేద రోగులకు అండగా ఎంపీ రఘునందన్ రావు

- **గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ ను ప్రారంభించిన బిజెపి నాయకులు**


గజ్వేల్, మార్చి 26 : పేద రోగులకు అండగా ఎంపీ రఘునందన్ రావు నిలిచారని, ఆయన గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేయడం సంతోషంగా ఉందని రాష్ట్ర నాయకులు ఎల్లు రాంరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు జశ్వంత్ రెడ్డి, బండారు మహేష్ లు అన్నారు. బుధవారం గజ్వేల్ ప్రభుత్వ దావఖానలో ఎంపీ రఘునందన్ రావు అందించిన అంబులెన్స్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ను అందించినందుకు ఎంపీ రఘునందన్ రావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉప్పల మధుసూదన్, పెండ్యాల శ్రీనివాస్, బారు అరవింద్, మహిళా మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లు రుచికరంగా తాగేద్దాం!



నీళ్లు తాగే విషయంలో చాలామంది నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే రోజూ నిర్ణీత మొత్తంలో నీరు తాగడం వల్ల శరీరంలోని విషతుల్యాలన్నీ బయటకు వెళ్లిపోయి, అనారోగ్యాల బారిన పడే అవకాశం తగ్గుతుంది. అలాగే శరీర బరువునూ అదుపులో ఉంచుకోవచ్చు. ఒకవేళ నీటిని ప్లెయిన్‌గా తాగడం ఇష్టం లేని వారు అందులో కొన్ని పదార్థాల్ని కలుపుకొని కూడా తీసుకోవచ్చు. ఫలితంగా నీటిని రుచికరంగా తయారు చేసుకోవడంతో పాటు మరిన్ని ప్రయోజనాల్ని కూడా పొందచ్చంటున్నారు నిపుణులు.





**కీరాదోస, పుదీనాతో..**

ముందుగా మూడు కీరాదోస కాయల్ని, నాలుగు నిమ్మకాయల్ని తీసుకుని చక్రాల్లా కట్ చేసుకోవాలి. లీటరు నీటిలో ఈ ముక్కల్ని, కొన్ని తాజా పుదీనా ఆకుల్ని వేసి.. రెండు గంటల పాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. అనంతరం నీటిని వడకట్టుకుని తాగడం వల్ల క్రమంగా బరువు తగ్గడంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాల్ని కూడా సొంతం చేసుకోవచ్చు. ఈ నీరు శరీరంలోని మలినాల్ని, విషపదార్థాల్ని బయటికి పంపిస్తుంది. నిమ్మలోని ఆల్కలీన్ సమ్మేళనాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే పుదీనా జీర్ణశక్తిని మెరుగుపరిస్తే.. కీరాదోస చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

**పండ్లతో..**

నిమ్మ, ద్రాక్ష, యాపిల్, కివీ, అనాస.. వంటి పండ్లతో తయారు చేసిన పానీయం కూడా బరువు తగ్గడంలో ఎంతగానో తోడ్పడుతుంది. ఒక గ్లాస్ నీటిలో కొన్ని పండ్ల ముక్కల్ని వేయాలి. ఈ మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో కొన్ని గంటల పాటు ఉంచాలి. ఆ తర్వాత మిశ్రమాన్ని



వడకట్టుకొనైనా తీసుకోవచ్చు.. లేదంటే ముందు పండ్లు తిని ఆ తర్వాత నీళ్లైనా తాగచ్చు. ఈ పండ్లలో ఎక్కువ మొత్తంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఎంజైమ్‌లు శరీరంలోని విషతుల్యాలను తొలగించడంలో సహాయపడతాయి. అంతేకాదు.. జీవక్రియల్ని వేగవంతం చేసి శరీరంలోని మలినాల్ని బయటికి పంపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అలాగే వీటిలోని విటమిన్ 'సి' రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

**దాల్చినచెక్కతో..**

ఒక గ్లాస్ నీటిలో కొన్ని యాపిల్, దాల్చిన చెక్క ముక్కల్ని వేసి.. ఈ మిశ్రమాన్ని గంట పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. మరీ రుచిగా కావాలనుకున్న వారు యాపిల్, దాల్చిన చెక్క ముక్కల్ని కాస్త ఎక్కువగా కూడా కలుపుకోవచ్చు. ఈ పానీయంలో క్యాలరీలు అసలే ఉండవు. కాబట్టి కూల్‌డ్రింక్ బదులు దీన్ని తీసుకోవచ్చు. దీనివల్ల బరువు తగ్గడంతో పాటు శరీరంలోని విషతుల్యాలు కూడా బయటికి వెళ్లిపోతాయి. అలాగే శరీరంలోని జీవక్రియల్ని వేగవంతం చేయడంలోనూ ఈ నీళ్లు కీలకపాత్ర పోషిస్తాయి.

**కలబందతో..**

కప్పు నీటిలో, రెండు చెంచాల చొప్పున నిమ్మ రసం, కలబంద గుజ్జు తీసుకుని మిశ్రమంలా తయారుచేసుకోవాలి. మరింత బాగా కలవాలంటే మిక్సీ కూడా పట్టుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల అలసట వెంటనే దూరమవడంతో పాటు జీర్ణశక్తి కూడా మెరుగుపడుతుంది.

**చెరకుతో..**

రెండు లీటర్ల నీటిలో.. అనాస, చెరకు ముక్కల్ని వేసి రెండు గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఆ తర్వాత వడకట్టుకొని తాగితే మంచి ఫలితం ఉంటుంది. చెరకు వేయడం వల్ల ఈ పానీయం రుచిగా ఉండడంతో పాటు.. శరీరంలోని విషతుల్యాలను కూడా సులభంగా బయటికి పంపిస్తుంది. ముఖ్యంగా అనాస ముక్కలు శరీరంలోని ఫ్రీరాడికల్స్‌ని తొలగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. చెరకు అలసటను దూరం చేసి తక్షణ శక్తిని అందిస్తుంది.

**కొవ్వు కరగడానికి..**

శరీరంలో నీటి నిల్వను పెంచి తద్వారా అనవసర కొవ్వుల్ని కరిగించడంలో యాపిల్ సైడర్ వెనిగర్‌తో తయారుచేసిన పానీయం కూడా బాగా ఉపయోగపడుతుంది. ఇందుకోసం గ్లాసు నీటిలో కొద్దిగా యాపిల్ సైడర్ వెనిగర్ వేసి బాగా కలిపి తీసుకోవాలి. చల్లగా కావాలనుకునే వారు అందులో కొన్ని ఐస్ క్యూబ్స్ వేసుకోవచ్చు. ఈ మిశ్రమం అజీర్తి సమస్యను దూరం చేసి తద్వారా బరువును అదుపులో ఉంచుతుంది.

# వచ్చే ఏడాది అక్టోబర్ లోగా గ్రామ గ్రామానికి ఆర్‌ఎస్‌ఎస్

*** ఈ ఏడాది నవంబర్ నుంచి జనవరి వరకు జన సంపర్క అభియాన్**



**బషీర్ బాగ్, సమయం న్యూస్:** వ్యక్తి నిర్మాణం ద్వారా స్వయంసేవకులను రూపొందిస్తూ సమాజ పరివర్తన ప్రధానంగా సంఘ్ కార్యం నడుస్తోందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) తెలంగాణ ప్రాంత కార్యదర్శి శ్రీ కాచం రమేశ్ తెలిపారు. బెంగళూరులో మార్చి 21 నుంచి 23 తేదీల మధ్య జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత ప్రతినిధి సభల నేపథ్యంలో చేసిన తీర్మానాలు, సంఘ్ శతాబ్ది సంవత్సరం సందర్భంగా తెలంగాణలోను, దేశవ్యాప్తంగాను చేపట్టనున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి హైదరాబాదులో మీడియా ప్రతినిధులకు వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వంద సంవత్సరాలకు చేరుకుంటున్న తరుణంలో సంఘ భావజాలం, సంఘ్ సిద్ధాంతాలను సమాజంలోకి మరింత వేగంగా తీసుకువెళ్లేందుకు, మరెన్నో ప్రత్యేక కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్న వేళ అఖిల భారత ప్రతినిధి సభలు జరిగాయన్నారు.. దేశవ్యాప్తంగా మొత్తం 51,570 స్థలాల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (RSS) దైనందిన శాఖలు 83,129 నడుస్తున్నాయి. వీటితో పాటు 32,147 శాఖా మిలన్లు (వీక్లీ), 12,091 నెలవారీ శాఖలు (మండలి) నడుస్తున్నాయి. మొత్తంగా దైనందిన శాఖ + మిలన్లు + మండలితో కలిపి 1,27,367 శాఖాపరమైన కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలంగాణలో మొత్తం 1,839 స్థలాలలో 3,117 శాఖలు నడుస్తుండగా గతేడాదితో పోల్చితే 392 కొత్త శాఖలు ప్రారంభమయ్యాయని, వారంవారీ సాప్తాహిక్ మిలన్లు 382, నెలవారీగా 224 శాఖలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇవన్నీ కలిపి తెలంగాణలో 3,800 పైచిలుకు శాఖలు నడుస్తున్నాయని, . స్లమ్స్‌లో సేవాబస్తీల పేరిట సంఘకార్య విస్తరణ ప్రయత్నం జరుగుతోందంటూ తెలంగాణలోని పలు సేవాబస్తీలలో శాఖల ద్వారా 980కి పైగా సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇక బంగ్లాదేశ్‌లోని మైనార్టీలు, ప్రత్యేకించి హిందువులపై జరుగుతున్న మారణకాండను ఖండిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ అఖిలభారత ప్రతినిధి సభలో చేసిన తీర్మానం గురించి శ్రీరమేష్ మీడియాకి తెలియజేశారు. ఇస్లామిక్ జిహాదీలు హిందూ మహిళలపై చేసిన అత్యాచారాలు, హిందువుల ఆస్తుల లూటీ, గృహదహనాలు తదితర పరిణామాలను, ఈ హింసాకాండను నిరోధించేందుకు అంతర్జాతీయ సమాజం తీసుకోవలసిన చర్యల గురించి ప్రస్తావించారు. అదే సమయంలో పోర్చుగీసువారిపై పోరాడిన భారత స్వాతంత్ర్య పోరాట యోధురాలు రాణి అబ్బక్క 500వ జయంతిని సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ సర్‌కార్యవాహ శ్రీ దత్తాత్రేయ హొసబాళె గారు విడుదల చేసిన ప్రకటన, గత ఏడాది రాణి అహల్యా బాయి 300వ జయంతి సందర్భంగా నిర్వహించిన సామాజిక సమరసత కార్యక్రమంలో భాగంగా క్యాలెండర్ల వితరణ గురించి వివరించారు..నూరేళ్ళ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సంఘ్ ఆలోచనలు, భావాలను సమాజం వద్దకు తీసుకెళ్లేలా వచ్చే నవంబర్‌డిసెంబర్‌జనవరి నెలల్లో దేశంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లడానికి జన సంపర్క అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమాజ పరివర్తనకు సంబంధించిన అంశాలను అందిస్తామన్నారు. ఇదే కార్యక్రమాన్ని తెలంగాణలోని ప్రతి గ్రామ పంచాయితీలోను, ప్రతి బస్తీలోనూ, ప్రతి మూల మూలనా అందరినీ కలుపుకుని వెళ్లేలా కరపత్రం, పుస్తకం పంపిణీ ద్వారా నిర్వహిస్తామన్నారు. ఇంకా అనేక బస్తీలు, ఉపమండలాలు, బ్లాక్ స్థాయిలోను, నగరాలలో ప్రతి లక్షమంది ఒక యూనిట్‌గా హిందూ సమాజ ఉత్సవాలు చేస్తామని, ఇందులో స్థానిక నేతలు, హిందూ సంస్థలకు భాగస్వామ్యం కల్పించి హిందుత్వాన్ని, ధర్మాన్ని సమాజంలోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు. మనమంతా ఒక్కటేననే ఏకాత్మ భావనను, సమరసతను ప్రేరేపించేలా ప్రతి బ్లాక్‌లోను వివిధ సంస్థలు, మఠాలు, కులాల ప్రముఖ వ్యక్తుల భాగస్వామ్యంతో సామాజిక సద్భావన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఇంకా, పర్యావరణ హితం, స్వదేశీ జీవన విధానాన్ని పాటించడం, సామాజిక అనుశాసనం, చట్టాలను పాటించడం, హిందూ కుటుంబాలను కాపాడటం వంటి అంశాలను తీసుకుని సామాజిక సద్భావన సదస్సులు నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. అదే క్రమంలో జిల్లా కేంద్రాలు, నగర కేంద్రాలలో ప్రతిష్ఠిత వ్యక్తులు, యువకులతో సదస్సులు నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ అక్టోబర్ నెలల్లో గ్రామగ్రామానికి శాఖను తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలకు ముందే తెలంగాణలో ప్రతి ఉపమండలం, బస్తీలో అన్నింటా కలిపి శాఖల సంఖ్యను 4 వేలకు చేర్చే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. *వ్యక్తి నిర్మాణం ద్వారా స్వయంసేవకులను రూపొందిస్తూ సమాజపరివర్తన ప్రధానంగా సంఘ్ కార్యం ఉంటూ వస్తోందని శ్రీ కాచం రమేష్ తెలియజేస్తూ ఈ సమైక్యతా కార్యం గురించి మీ మీడియా ద్వారా సమాజానికి తెలియజేయాలని కోరారు

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD.
PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net
Mobile No. 98660 19778, 89789 60131.